# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
26-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 186

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ..

బాలాపూర్ గణేశుడి లడ్డూకు రికార్డు ధర

రూ.39 లక్షలకు దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి

గతేడాది ధరను దాటేసిన తాజా బిడ్

లడ్డూ కోసం హోరాహోరీగా సాగిన వేలం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** బాలాపూర్‌లో గణేశ్ ఉత్సవాలకు ఎంత ప్రత్యేకత ఉందో.. అక్కడ జరిగే లడ్డూ వేలానికి అంతే క్రేజ్ ఉంటుంది. గణనాథుడి ప్రసాదంగా భావించే ఆ లడ్డూను సొంతం చేసుకోవాలనే ఆసక్తితో ఈసారి కూడా పలువురు రంగంలోకి దిగారు. వేలం మొదలైన కొద్దిసేపటికే బిడ్లు ఒక్కొక్కటిగా పైకి ఎగబాకాయి.

- మిగతా 2వ పేజీలో

## డీకే అరుణకు నో ఛాన్స్!

కేంద్ర మంత్రివర్గంలో అవకాశం లేనట్టే

తమిళనాడు సహ ఇన్చార్జిగా నియామకం

అభిమానుల ఆశలపై నీళ్లు



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** డీకే అరుణ ఆశలపై బిజెపి హై కమాండ్ నీళ్లు చల్లిందా? కేంద్ర క్యాబినెట్లోకి ఆమె ప్రవేశం సాధ్యం కాదా?

- మిగతా 2వ పేజీలో



## ఆర్టీసీలో ఎన్నికల సందడి!

8 ఏళ్ల తర్వాత గుర్తింపు సంఘాలకు ఎన్నికలు

తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు కాంగ్రెస్ మద్దతు

పార్టీ శ్రేణులు ఆ యూనియన్ గెలుపునకు సహకరించాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న

- మిగతా 2వ పేజీలో



## ఖైరతాబాద్ కష్టమేమి కాదు!

కాంగ్రెస్ కే అనుకూలం

వరుసగా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం

గ్రేటర్ లో గులాబీ పార్టీ బలహీనం

దానం నాగేందర్ అభ్యర్థిత్వం.. ఆపై అధికార భద్రంతో విజయం ఖాయం

అయినా భయపడుతున్న హస్తం



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ వ్యూహాత్మక తప్పిదానికి పాల్పడిందా? గ్రేటర్ ఎన్నికల విషయంలో అనవసరంగా జాప్యం చేసిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు అంటేనే కాంగ్రెస్ పార్టీలో ఏదో తెలియని ఆందోళన కనిపిస్తోంది. అనవసర కంగారుతో వెనకడుగు వేస్తోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే మాత్రం తెలంగాణలో అధికారంలో వచ్చిన నాటి నుంచి నగర ఓటర్లు కాంగ్రెస్ వైపే స్పష్టంగా నిలబడ్డారు అనేది గణాంకాలు తెలియజేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ సంక్షేమ పథకాలు, బాలనాథ్ తీరుకు ప్రజలు అండగా నిలిచారు అని స్పష్టం అవుతుంది.

- మిగతా 3వ పేజీలో

## హుజురాబాద్‌కు ఉప ఎన్నిక!

పాడి కౌశిక్ రెడ్డి పై వేలాడుతున్న అనర్హత కత్తి

అనుచిత ప్రవర్తన పై కొనసాగుతున్న ప్రివిలైజ్ కమిటీ విచారణ

స్పీకర్ వేటు వేసే ఛాన్స్

తెలంగాణలో రెండు స్థానాలకు ఉప ఎన్నికలు

ఆత్మరక్షణలో బీఆర్ఎస్







**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పదు అని తేలిపోయింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సుప్రీంకోర్టు సైతం సమర్థించింది. అయితే ఈ విషయంలో గులాబీ పార్టీ చేసిన పోరాటం సక్సెస్ అయ్యింది.

- మిగతా 2వ పేజీలో

## షర్మిల తో పూర్తిగా కటీఫ్!



3లో

మేనకోడలు అంజలి రెడ్డి నిశ్చితార్థ వేడుకలకు హాజరు కాని జగన్

మేనమామగా చేయాల్సిన కార్యక్రమాలకు సైతం దూరం

ఆవేదనలో రాజశేఖర్ రెడ్డి అభిమానులు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైఎస్ షర్మిల కుమార్తె అంజలి రెడ్డి నిశ్చితార్థ వేడుకలు ఘనంగా జరిగాయి.

## ఇండియా కూటమిలోకి జగన్!



రంగంలోకి వామపక్షాలు

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ చర్చలు

కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్న సంకేతాలు

2లో

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడి నోటీసులు

వ్యక్తిగత ఖాతా ద్వారా రూ. 2.1 కోట్ల మళ్లింపు

27న విచారణకు హాజరు కావాలంటూ పేర్కొన్న ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్



## 'సాహితీ ఇన్ ఫ్రా' కొత్తకోణం!

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాదులో రియల్ ఎస్టేట్ పేరుతో భారీ మోసానికి పాల్పడింది సాహితి ఇన్ఫ్రాటెక్. ఈ వెంచర్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కి ఈడి నోటీసులు ఇచ్చింది. దాదాపు 3 వేల కోట్ల స్కాం ఇది. ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో అతి తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామంటూ వేలాదిమంది కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసింది సాహితీ యాజమాన్యం. ఈ మోసానికి సంబంధించి 64 కేసులు నమోదయ్యాయి.

- మిగతా 3వ పేజీలో

## సజ్జనార్ టార్గెట్!

ఇప్పటికీ తమ మాటే వినాలంటున్న గులాబీ పార్టీ

లేకపోతే రిటైర్ అయిన వదలమంటూ హెచ్చరిక

పదేళ్ల పాలనలో అదే అధికారితో అనుకూల పనులు

ఇప్పుడు కూడా తమ ఆదేశాలను పాటించమంటున్న బిఆర్ఎస్ పెద్దలు

2లో

## మేయర్‌గా వంగవీటి!

టిడిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్

పవన్ కళ్యాణ్ ఆశీర్వాదం తీసుకున్న రాధాకృష్ణ

శరవేగంగా మారుతున్న బెజవాడ రాజకీయాలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయవాడ మేయర్ గా వంగవీటి రాధాకృష్ణ బరిలో దిగుతారా? ఆ మేరకు చంద్రబాబు నుంచి



3లో

## డీఎస్పీ భీమ్ రెడ్డి వెనుక బలమైన శక్తులు!

తెర వెనుక అప్పటి పోలీస్ అధికారితో పాటు ఒక రాజకీయ నేత?

బయటపడితే సంచలనమే



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో ఇప్పుడు సస్పెండ్ అయిన డి.ఎస్.పి సంకిరెడ్డి భీమ్ రెడ్డి చుట్టూ చర్చ నడుస్తోంది. తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగంలో పనిచేస్తూ.. ఏసీబీకి చిక్కి సస్పెండ్ అయ్యారు భీమ్ రెడ్డి. అయితే ఈ వ్యవహారంలో రోజుకో సంచలనాత్మక విషయం వెలుగులోకి వస్తోంది.

# ఇండియా కూటమిలోకి జగన్!



(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో** : ఇండియా కూటమి వైపు జగన్ అడుగులు వేస్తున్నారు. ఏపీ రాజకీయాల్లో సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న జగన్ జాతీయస్థాయిలో ఒక తోడు అవసరం అని భావిస్తున్నారు. తీవ్ర ఆలోచనల నడుమ ఆయన ఇండియా కూటమి వైపు అడుగులు వేస్తున్నట్లు అర్థం అవుతుంది. ఏపీలో వామపక్షాలు జగన్మోహన్ రెడ్డిని కలిసి.. తమతో కలిసి రావాలన్న పిలుపు నేపథ్యంలో జగన్ ఆలోచన మారినట్లు అర్థం అవుతోంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వామపక్షాలు తీవ్రంగా టార్గెట్ చేసుకునేవి. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి పార్టీని తీవ్రంగా వ్యతిరేకించాయి వామపక్షాలు. అటువంటి లెఫ్ట్ పార్టీలు ఇప్పుడు జగన్మోహన్ రెడ్డితో కలిసి నడిచేందుకు సిద్ధపడటం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. ఇండియా కూటమిలోకి జగన్మోహన్ రెడ్డిని చేర్పించేందుకు ఈ వ్యూహం అని అర్థం అవుతోంది.

**స్పష్టమైన మార్పు..**

ఇటీవల జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. జాతీయ రాజకీయ వ్యూహంలో వస్తున్న మార్పులు కూడా స్పష్టంగా తెలియజేస్తున్నాయి. జగన్ ఓడిపోయిన తర్వాత కూడా ఆయన విధానాలను, రాజకీయాలను విమర్శిస్తూ వచ్చారు సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ. అనూహ్యంగా ఆయన తాడేపల్లిలో జగన్ నివాసానికి వెళ్లి చర్చలు జరపడం చర్చనీయాంశమైంది. తమ పార్టీ నిర్వహించే సదస్సుకు హాజరు కావాలంటూ జగన్మోహన్ రెడ్డిని ఆయన ఆహ్వానించడం కేవలం ఒక సాధారణ మర్యాదపూర్వక భేటీ ఎంత మాత్రం కాదు. దీని వెనుక జాతీయ రాజకీయ వ్యూహం దాగి ఉంది. జగన్మోహన్ రెడ్డిని ఇండియా కూటమిలో చేర్చేందుకు.. బిజెపి వైపు ఉన్న ఆ చిన్న బంధాన్ని తొలగించేందుకు వామపక్షాలు రంగంలోకి దిగాయి అనేది ఒక బలమైన వాదన.

**గతంలో ఆహ్వానం లేదు..**

గతంలో సిపిఐ జాతీయ, రాష్ట్రస్థాయిలో ఎన్నో కీలక సదస్సులు, చర్చ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ.. వైసీపీని, జగన్మోహన్ రెడ్డిని ఏనాడు భాగస్వామ్యం చేసి ఆహ్వానించిన దాఖలాలు లేవు. అలాంటిది ఇప్పుడు రాత్రికి రాత్రి సిపిఐ వైఖరిలో ఈ మార్పు రావడానికి వెనుక జాతీయస్థాయి ఇండియా కూటమి అగ్ర నేతల స్పష్టమైన సూచనలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. జాతీయస్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే క్రమంలో.. ఏపీలో వైసీపీని మెల్లగా కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి వైపునకు తిప్పుకునేందుకు కమ్యూనిస్టులను దూతలుగా వాడుకుంటున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

**రాజకీయ రక్షణ కవచంగా..**

ప్రస్తుతం ఏపీలో జగన్మోహన్ రెడ్డితో కలిసి వచ్చే పార్టీలు లేవు. అందుకే ఈ తాజా పరిణామాలను తన రాజకీయ రక్షణ కవచంగా, వ్యూహాత్మక ఆయుధం గా మలుచుకోవడానికి జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. కేంద్రంలోని బిజెపి పెద్దలతో సఖ్యతగా ఉంటూ తనపై ఉన్న కేసులు, ఇతర అంశాల్లో లబ్ధి పొందారు జగన్. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పైగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమిక్కి కేంద్ర పెద్దలు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బిజెపిని నమ్ముకోవడం కంటే ప్రత్యామ్నాయం బెటర్ అన్న ఆలోచనకు వచ్చారు. కమ్యూనిస్టులతో వేదికలు పంచుకోవడం ద్వారా అవసరం అనుకుంటే కాంగ్రెస్తో జతకట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు బిజెపికి పంపేందుకు.. ఇలా కొత్త స్నేహం వైపు అడుగులు వేస్తున్నారు అనేది రాజకీయ నిపుణుల అంచనా. చివరికి ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# ఆర్టీసీలో ఎన్నికల సందడి!

ఈ ఎన్నికలకు అక్టోబర్ 9న పోలింగ్ జరగనుంది. దీంతో కార్మిక సంఘాలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన మద్దతును ఒక యూనియన్ ప్రకటించడం చర్చనీయాంసంగా మారింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ కు తమ మద్దతు ఇస్తున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ మద్దతు ఆ యూనియన్కే నంటూ బాహటంగా ప్రకటించారు. ఇదే విషయాన్ని పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కూడా తెలియజేసినట్లు తెలుస్తోంది.

**సన్నాహక సమావేశం..:** ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నేతలు, టీ డబ్ల్యూ యు ప్రతినిధులు హాజరయ్యారు. కార్మికుల సమస్యలు, పని పరిస్థితులు, పెండింగ్ అంశాలు, ఆర్టీసీ భవిష్యత్ తదితర అంశాలపై చర్చ జరిగింది. టి డబ్ల్యూ యు విజయం కోసం క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఆర్టీసీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టిపిసిసి ఉపాధ్యక్షుడు, జిహెచ్ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను పార్టీ ఎన్నికల సమన్వయకర్తగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్మిక సంఘం ప్రతినిధుల మధ్య సమన్వయం చూసే బాధ్యతను బొంతు రామ్మోహన్ కు అప్పగించింది.

**పక్కా వ్యూహంతో కాంగ్రెస్..:** ఆర్టీసీ ఎన్నికల్లో తాము మద్దతు తెలిపిన కార్మిక సంఘం విజయం సాధించేలా కాంగ్రెస్ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. డిపోల వారీగా పార్టీ నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహం సిద్ధం చేసింది. కాకా తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంగం ఎన్నికల షెడ్యూల్ను కార్మిక శాఖ ఈనెల 18న విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 9న ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ కోసం అక్టోబర్ 14, 15వ తేదీలను కేటాయించారు. అక్టోబర్ 17న ఫలితాలను ప్రకటించనున్నారు.

**చివరిసారిగా 2016లో..:** ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు చివరిసారిగా 2016లో జరిగాయి. ఇప్పుడు సుదీర్ఘ విరామం తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోలో ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు మొదలయ్యాయి. ఆర్టీసీలో గుర్తింపు సంఘం హోదా కోసం పలు కార్మిక సంఘాలు పోటీకి సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ తో పాటు ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, కార్మిక సంఘ, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ వంటి సంఘాలు ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 26న పోటీ చేసే యూనియన్లకు ఎన్నికల గుర్తును కేటాయించనున్నారు.

# సజ్జనార్ టార్గెట్!

(మొదటి పేజీ తరువాయి)





**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పై గులాబీ పార్టీ రగిలిపోతోంది. పోలీసు ఉన్నతాధికారి అని చూడకుండా తీవ్ర స్థాయిలో రెచ్చిపోతోంది. గులాబీ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అయితే తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. ఆ పార్టీ కార్యాలయంలో కూర్చుని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రెండేళ్లలో రిటైర్ అయినా వదిలిపెట్టం అంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి పదవీ విరమణ చేసి సప్త సముద్రాలు అవతల ఉన్న పట్టుకొస్తాం అంటూ బహిరంగ హెచ్చరికలు జారీచేశారు. వినాయక నిమజ్జన ఊరేగింపుల్లో రాజకీయ, కెసిఆర్ పాటలను పబ్లిక్ గా అడ్డుకోవడం పై వివాదం రాజుకుంది. అందులో భాగంగానే పాడి కౌశిక్ రెడ్డి ఏకంగా సిటీ పోలీస్ కమిషనర్ పైనే తీవ్రస్థాయిలో విరుచుకు పడడం హాట్ టాపిక్ అవుతుంది.

**పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో..**

గత గులాబీ ప్రభుత్వ హయాంలో కూడా సజ్జనార్ పని చేశారు. అప్పటి పెద్దలకు అనుకూలంగా, వారి ఆదేశాలను పాటించారు. గులాబీ పార్టీ పదేళ్ల పాలనాకాలంలో.. ముఖ్యంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ గా పనిచేసిన సమయం నుంచి ఆర్టీసీ ఎండిగా పంపించే వరకు సజ్జనార్ ను నాటి ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగించుకుందో రాజకీయాల పట్ల అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికి తెలుసు.. వివాదాస్పదమైన దిశ ఎన్కౌంటర్ ఉదంతం నుంచి మొదలుకొని విపక్ష ప్రజాప్రతినిధుల కదలికలను కట్టడి చేయడం, వారిని ఇబ్బంది పెట్టడం వంటి పొలిటికల్ ప్లాన్లను అమలు చేయడంలో సజ్జనార్ పాత్ర ఎంత కీలకమో వాటిని భరించిన ప్రతిపక్ష నేతలకు తెలుసు.

**ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు..**

సాధారణంగా ప్రభుత్వ ఆదేశాలు, ప్రభుత్వ పెద్దల సూచనలు అధికారులు పాటించడం అనేది సహజం. ఈ ఫార్ములాను అనుసరించి గులాబీ పార్టీ నేతలు సజ్జనార్ ను ఏ స్థాయిలో వాడుకున్నారో తెలియంది కాదు. ఇప్పుడు అదే స్థాయిలో వాడుకుంటామంటే కుదరదు. ఆ ఛాన్స్ కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చింది. వాస్తవానికి సజ్జనార్ ను అప్రధాన్యత పోస్టులో నియమించాలి. కానీ రేవంత్ సర్కార్ ఆ పని చేయలేదు. ఏకంగా హైదరాబాద్ సిటీ కమిషనర్ వంటి కీలక పదవిలో నియమించింది. అయితే మునుపటిలా అధికారంలో ఉన్నట్టే సజ్జనార్ తమకు అనుకూలంగా వ్యవహరిస్తారని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. అంతకంటే అజ్ఞానం మరొకటి ఉండదు. ఇప్పుడు పాడి కౌశిక్ రెడ్డి లాంటి జూనియర్ నేతతో పోలీస్ అధికారి సజ్జనార్ ను బెదిరించే స్థాయికి వచ్చారు. వాస్తవానికి పోలీస్ వ్యవస్థ అనేది ఎప్పుడు అధికార చక్రం చుట్టూ తిరిగే ఒక చక్రం లాంటిది. సజ్జనార్ ను బెదిరించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలువరించలేరు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు.



# రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ..

చివరకు రూ.39 లక్షల వద్ద వేలం ముగియడంతో అందరి దృష్టి సామ ప్రణీత్ రెడ్డి వైపు మళ్లింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి అత్యధిక బిడ్ వేసి బాలాపూర్ గణేశుడి లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈసారి వేలంలో మొత్తం తొమ్మిది మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందినవారు కూడా లడ్డూను దక్కించుకునేందుకు ఆసక్తి చూపారు. వేలం ప్రారంభ ధరగా రూ.1,116ను నిర్ణయించారు. అక్కడి నుంచి మొదలైన బిడ్డింగ్ క్రమంగా భారీ మొత్తాలకు చేరింది. ఒక దశలో గతేడాది నమోదైన రూ.35 లక్షల ధరను కూడా దాటింది. చివరికి రూ.39 లక్షల వద్ద సామ ప్రణీత్ రెడ్డి బిడ్ నిలవడంతో ఈ ఏడాది కొత్త రికార్డు నమోదైంది. గతేడాది కంటే రూ.4 లక్షలు అధికంగా పలకడం విశేషం. బాలాపూర్ లడ్డూకు ఇంతటి డిమాండ్ ఉండటానికి భక్తుల్లో ఉన్న విశ్వాసమే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఈ లడ్డూను దక్కించుకుంటే ఆరోగ్యం, ఐశ్వర్యం, శుభం కలుగుతాయని స్థానికులు, భక్తుల్లో నమ్మకం ఉంది. అందుకే ప్రతి సంవత్సరం వేలం ప్రక్రియపై ప్రత్యేక ఆసక్తి నెలకొంటుంది.

# డీఎస్పీ భీమ్ రెడ్డి వెనుక బలమైన శక్తులు!

(మొదటి పేజీ తరువాయి)

సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల వరకు అక్రమాస్తులను కూడబెట్టినట్లు ఏసీబీ ప్రాథమికంగా లెక్క కట్టింది. అయితే ఆ ఆస్తుల వెనుక ఉన్న అసలు నెట్వర్క్ చూసి దర్యాప్తు అధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు. భీమ్ రెడ్డి కేవలం ఒక ఫ్రంట్ మాన్ మాత్రమేనని.. ఆయన వెనుక వ్యవస్థలను శాసించే పెద్దలు ఉన్నారనే సందేహాలు బలపడుతున్నాయి. తాజాగా ఏసీబీ అధికారులు జూబ్లీహిల్స్, పుప్పాలగూడ, బహిరాబాద్లలో చేపట్టిన ఏకకాలం దాడుల్లో ఏకంగా ఎనిమిది మంది ప్రధాన బినామీలను గుర్తించారు. రూ.1.35 కోట్ల నగదు, విదేశీ కరెన్సీ, కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడం హాట్ టాపిక్ అవుతోంది.

**అంత సంపాదన సాధ్యమేనా?**

భీమ్ రెడ్డి పోలీస్ శాఖలో సాధారణ డీఎస్పీ. కానీ ఆయన ఆస్తులు చూస్తే మాత్రం హడలెత్తాల్సిందే. లగ్జరీ విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు, ఎకరాల వ్యవసాయ భూములు కేవలం ఒక్క డీఎస్పీ స్థాయి అధికారి జీతభత్యాలతో సాధ్యం అయ్యేవి కావని స్పష్టం అవుతుంది. అందులోనే ఓ సాండ్ మైనింగ్ కాంట్రాక్టులో రూ. 75 లక్షల మేర పెట్టుబడులు ఉన్నట్లు పత్రాలు లభించాయి. అయితే ఈ ఆస్తులు వెనుక ఒక పోలీసు ఉన్నతాధికారితో పాటు గతంలో అధికారం చలాయించిన కీలక రాజకీయ నాయకుడి హస్తం ఉందని ప్రచారం హైదరాబాద్ లీగల్, పోలీస్ వర్గాల్లో ఉంది. సదరు పోలీస్ బాస్ రక్షణలో, రాజకీయ నాయకుడి ఆశీస్సులతోనే భీమ్ రెడ్డి ఇన్నాళ్లు తన బినామీ నెట్వర్క్ ను రాజధాని వ్యాప్తంగా విస్తరించారని అనుమానాలు ఉన్నాయి.

**కీలక డైరీ తోనే..**

ఏసీబీ తనిఖీల్లో ఒక కీలక డైరీ బయటపడినట్లు తెలుస్తోంది. అదే ఈ బినామీ బాగోతాన్ని బయటపెట్టినట్లు సమాచారం. చార్ దామ్ యాత్రకు వెళ్లే ముందు భీమ్ రెడ్డి స్వహస్తాలతో రాసుకున్న రాత ప్రతిలో తన ఆస్తుల వివరాలు, ఎవరి పేరుతో ఎంతెంత పెట్టుబడులు పెట్టారనే బినామీల జాబితాను నిక్షిప్తం చేసినట్లు తెలుస్తోంది. దాని ఆధారంగానే ఏసీబీ సోదాలు నిర్వహించి విదేశీ మద్యం, కేజీల కొద్దీ బంగారం, వెండి నాణేలతోపాటు అసలు ముఠా గుట్టు రట్టు చేసింది. దర్యాప్తు ఊపందుకోవడంతో పాటు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ కూడా మనీ లాండరింగ్ కోణంలో రంగంలోకి దిగింది. భీమ్ రెడ్డికి అభయహస్తం ఇచ్చిన ఆ పెద్దల గుండెల్లో ఇప్పుడు రైలు పరిగెడుతున్నాయి. ప్రస్తుతం తనిఖీలను ఎదుర్కొంటున్న బినామీలు కానీ నోరు విప్పితే.. భీమ్ రెడ్డి అసలు పేర్లు బయట పెడితే రాష్ట్ర రాజకీయ, పోలీస్ వర్గాల్లో ప్రకంపనలు తప్పవు. ఇన్నాళు ౣ తెర వెనుక ఉంటూ కోట్ల రూపాయల నల్లధనాన్ని భీమ్ రెడ్డి ద్వారా రియల్ ఎస్టేట్, మైనింగ్ రంగాల్లోకి మళ్లించిన ఆ బినామీ యజమానులు ఎవరో బయటకు వస్తే తెలంగాణ రాష్ట్రంలో సంచలనం తప్పదు.

# హుజురాబాద్‌కు ఉప ఎన్నిక!

(మొదటి పేజీ తరువాయి)

గడిచిన రెండున్నర సంవత్సరాల కాలంలో భారత రాష్ట్ర సమితి మూడు ఎమ్మెల్యేల సీట్లను కోల్పోయింది. ఇద్దరు ఎమ్మెల్యేలు చనిపోయారు. మూడో ఎమ్మెల్యే అనర్హతకు గురయ్యారు. మరో ఎమ్మెల్యేను కూడా తగ్గించేందుకు కాంగ్రెస్ సిద్ధపడుతోంది. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లక్ష్యంగా అనర్హత అస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. ఒకే దెబ్బకు రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు తీసుకొచ్చి గులాబీ పార్టీని ఆత్మరక్షణలో నెట్టాలన్నది రేవంత్ సర్కార్ ప్రణాళికగా తెలుస్తోంది. శాసనసభ సమావేశాల్లో సీనియర్ శాసనసభ్యులు, మాజీ మంత్రి కడియం శ్రీహరిని ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, అనుచిత ప్రవర్తనను కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత సీరియస్ గా తీసుకుంది. సభా మర్యాదలు ఉల్లంఘించడం, అసెంబ్లీ సాక్షిగా తోటి సభ్యుడిని అవమానించిన ప్రవర్తించడంపై ప్రివిలేజ్ కమిటీ విచారణ ముమ్మరం చేసింది. కమిటీ ఇచ్చే సిఫారసుల ఆధారంగా కౌశిక్ రెడ్డి పై శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు లైన్ క్లియర్ అవుతోంది. సభా నియమావళి, శాసనసభ అంతర్గత క్రమశిక్షణ వ్యవహారాల్లో.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 212 ప్రకారం కోర్టులు నేరుగా జోక్యం చేసుకోలేవన్నది న్యాయ నిపుణుల అభిప్రాయం.

**గత పరిణామాల దృష్ట్యా..**

గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోను ఇటువంటి పరిణామమే జరిగింది. ఉమ్మడి అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగ సమయంలో హెడ్ ఫోన్స్ విసిరే సారన్న కారణంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్ ల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. న్యాయస్థానాలు సైతం స్పీకర్ నిర్ణయాధికారాల పరిధిని పరిగణలోకి తీసుకుంటూ తీర్పులు ఇచ్చాయి. ఇప్పుడు ఇదే అస్త్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తిరగేసి ప్రయోగించేందుకు పూర్తిగా కసరత్తు చేస్తోంది. దానం నాగేందర్ కేసులో టెన్త్ షెడ్యూల్ నిబంధనలతో కోర్టుల ద్వారా భారత రాష్ట్ర సమితి ముందడుగు వేస్తే.. కౌశిక్ రెడ్డి విషయంలో అసెంబ్లీ విశేషాధికారాల కమిటీ నివేదిక ద్వారా కాంగ్రెస్ తన రాజకీయ పగను తీర్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంది.

**గులాబీ పార్టీకి కష్టమే..**

కౌశిక్ రెడ్డి పై అనర్హత వేటు పడితే హుజూరాబాద్ కు ఉప ఎన్నిక ఖాయం. అదే జరిగితే ఖైరతాబాద్ తో పాటు హుజురాబాద్ కు ఒకేసారి ఎన్నిక జరగనుంది. ఒకవైపు హైదరాబాద్ నగరంలో దానం పై వచ్చిన తీర్పును రాజకీయంగా ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదు గులాబీ పార్టీకి. మరోవైపు కరీంనగర్ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన హుజురాబాద్ స్థానంలోనూ ఉప ఎన్నికలకు వెళ్లాల్సి రావడం గులాబీ పార్టీకి ఇబ్బందికరమే. దూకుడు ప్రదర్శిస్తున్న కౌశిక్ రెడ్డిని కట్టడి చేయడంతో పాటు ఆ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవడం ద్వారా గులాబీ పార్టీని పూర్తిగా దెబ్బతీయాలన్నది కాంగ్రెస్ ఆలోచన. దానం నాగేందర్ పై వేటు వేయించి సంబర పడే లోపే.. హుజురాబాద్ రూపంలో భారత రాష్ట్ర సమితికి కాంగ్రెస్ డబుల్ షాక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

# డీకే అరుణకు నో ఛాన్స్!

ఆమెకు చోటు లేనట్టేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా జరిగిన పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు బిజెపి బాధ్యులను నియమించింది హై కమాండ్. పార్టీలో సీనియర్లకు బాధ్యతలు కట్టబెట్టింది. అందులో భాగంగా తమిళనాడు బీజేపీ సహ ఇంచార్జ్గా డీకే అరుణను నియమించింది. దీంతో ఆమెకు మంత్రి పదవి లేనట్టేనని టాక్ నడుస్తోంది. త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో తమ అభిమాన నేతకు తప్పకుండా ఛాన్స్ అనుచరులు ఆశలు పెట్టుకున్నారు. కానీ తాజా నియామకం ద్వారా మంత్రివర్గంలో అరుణకు చాన్స్ లేదని తేలిపోయింది.

**సహకరించని సమీకరణలు..:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో మహబూబ్నగర్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచారు డీకే అరుణ. అప్పటినుంచి ఆమెకు కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందని అంత భావించారు. కానీ వివిధ సమీకరణలో భాగంగా ఆమెకు ఛాన్స్ ఇవ్వలేదు మోదీ. అయితే మంత్రివర్గ విస్తరణలో ఆమెకు అవకాశం ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగింది. మహిళా కోటాలో ఆమెకు మంత్రి పదవి ఇస్తారన్న టాక్ నడిచింది. కొందరు అభిమానులు అయితే సోషల్ మీడియా వేదికగా ముందుగానే ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అందుకు తగ్గట్టుగానే ఆమెకు జాతీయస్థాయిలో ఉన్న జాతీయ ఉపాధ్యక్షురాలు పదవి నుంచి తొలగించారు.. మంత్రి పదవి కోసమే ఆమెకు జాతీయ కార్యవర్గం నుంచి తప్పించారన్న టాక్ కూడా నడిచింది. కానీ ఇప్పుడు మరో రాష్ట్రానికి బాధ్యతలు అప్పగించడం ద్వారా మంత్రివర్గంలో స్థానం లేదని తేలిపోయింది. దీంతో అభిమానులు నిరాశకు గురవుతున్నారు.

**సుదీర్ఘ నేపథ్యం..:** తెలంగాణలో డీకే అరుణ సీనియర్ మోస్ట్ లీడర్. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. ఆమెది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. 1996లో మహబూబ్ నగర్ లోక్సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేశారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1998లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు మహబూబ్నగర్ పార్లమెంట్ స్థానానికి. అయినా సరే ఓటమి ఎదురయింది. 1999లో గద్వాల శాసనసభ స్థానానికి పోటీ చేసిన ఆమెకు ఓటమి తప్పలేదు. ఇలా వరుసగా ఓటములు ఎదురైనా ఆమె వీళ్ళు తిరిగి చూడలేదు. 2004లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చేందుకు నిరాకరించింది. కానీ గద్వాల నుంచి సమాజ్వాది పార్టీ నుంచి పోటీ చేసి గెలిచారు అరుణ. అలా శాసనసభలో అడుగు పెట్టారు. అయితే కాంగ్రెస్ అనుబంధ సభ్యురాలిగా శాసనసభలో ఆమె కొనసాగారు. ఆ కారణంగానే సమాజ్వాది పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. 2009లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు.

# ఖైరతాబాద్ కష్టమేమి కాదు!



(మొదటి పేజీ తరువాయి)

కానీ ఎందుకో కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ విషయాన్ని నమ్మడం లేదు. గ్రేటర్ ఎన్నికలకు వెళ్లేందుకు భయపడుతోంది.

**మిశ్రమ ఫలితాలు..**

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మిశ్రమ ఫలితాలు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆ పార్టీకి మంచి ఆదరణ దక్కింది. కానీ గ్రేటర్ పరిధిలో మాత్రం కనీస స్థాయిలో కూడా విజయాన్ని అందుకోలేకపోయింది. ఫలితాలు వచ్చిన తరువాత మాత్రం ప్రజల్లో ఒక రకమైన మార్పు కనిపించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో అది స్పష్టంగా కనిపించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత బిఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. కానీ ఆమె అకాల మరణంతో ఉప ఎన్నిక వచ్చింది. అక్కడ సానుభూతి పవనాలు పనిచేస్తాయని గులాబీ పార్టీ అంచిన వేసుకుంది. కానీ ప్రజలు వాటిని పట్టించుకోకుండా కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ ను భారీ మెజారిటీతో గెలిపించారు. గులాబీ పార్టీ అక్కడ ఏకంగా మూడో స్థానానికి పరిమితం అయింది. డిపాజిట్ గండం కూడా ఎదుర్కొంది. అటు తరువాత మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్ కు ఉప ఎన్నిక వచ్చింది. అక్కడ కూడా అదే సీన్ రిపీట్ అయింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించారు.

**నగరవాసులు హస్తం వైపు..**

తాజాగా ఖైరతాబాద్కు ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ ఎటువంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు అని తెలుస్తోంది. దానం నాగేందర్ కు ఉన్న వ్యక్తిగత క్యాడర్, మాస్ ఫాలోయింగ్, దశాబ్దాల పట్టు తిరుగులేనివి. ఆయన స్వయంగా కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగితే అధికార పార్టీకి గెలుపు చాలా సులువు. ఎందుకంటే ప్రభుత్వ యంత్రాంగం అండ, అధికార పార్టీ క్రేజ్, దానం సొంత బలం తోడైతే ఖైరతాబాద్ ను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం ఏమంత కష్టం కాదు. గత రెండు ఉప ఎన్నికల ట్రెండ్ ను పరిశీలిస్తే.. కాంగ్రెస్ సంక్షేమ ఫలాలు అందుకుంటున్న నగర ఓటర్లు ప్రభుత్వ వ్యతిరేకత వైపు కాకుండా అధికార పార్టీ వైపే మొగ్గ చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**పట్టు కోల్పోయిన వైనం..**

మొన్నటి ఎన్నికల్లో నగర పరిధిలో భారత రాష్ట్ర సమితి మంచి ఫలితాలు సాధించింది. కానీ గత మూడేళ్ల కాలంలో మాత్రం ఆ పార్టీ పట్టు కోల్పోయింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ లో వరుస పరాజయాలు మూటగట్టుకుంది. ఇప్పుడు ఖైరతాబాద్ లో నిలబెట్టేందుకు కనీసం ఒక బలమైన అభ్యర్థి కూడా ఆ పార్టీకి లేరు. ఎవరిని బరిలో దింపినా దానం ఎదుట నిలబడలేమని ఆందోళన వారిలో కనిపిస్తోంది. బిజెపికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లాంటి నేతలైన ఉన్నారు కానీ.. గులాబీ పార్టీకి మాత్రం ఆ పరిస్థితి లేదు. ఆపై పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కూడా ఈ నియోజకవర్గంలో ఉన్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అంశాలు.

# 'సాహితీ ఇన్ ఫ్రా' కొత్తకోణం!

కంపెనీ యాజమాన్యంలోని సాహితీ లక్ష్మీనారాయణ వసూలు చేసిన డబ్బులను సొంత ప్రయోజనాలకు ఉపయోగించారన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 13 మంది నిందితులపై అభియోగాలు నమోదయ్యాయి. అయితే ఇప్పుడు ఎమ్మెల్యే గాంధీకి ఈడి నోటీసులు ఇవ్వడం సంచలనంగా మారింది. ఈ స్కాం తో వేలాదిమంది మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయి. బాధితులు గతంలో ధర్నాలు, నిరసనలు కూడా చేపట్టారు. పోలీసు విచారణ సైతం కొనసాగుతోంది. సమాంతరంగా ఈడి రంగంలోకి దిగింది.


**రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదిపేసిన వైనం..**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదిపేసింది సాహితి ఇన్ఫ్రా ప్రీ లాంచ్ స్కాం. అయితే ఈ కేసులో ఈడి ఎంట్రీ ఇచ్చింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి నోటీసులు జారీ చేసింది. అనుమతులు లేకుండా ప్లాట్లు, విల్లాలు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 842 కోట్ల మేర అమాయక కొనుగోలుదారులకు మోసం చేసిన ఈ స్కాం లో.. అరికెపూడి గాంధీ బ్యాంకు ఖాతాల ద్వారా దాదాపు రూ. 2.1 కోట్లు మళ్లించినట్లు ఈడి అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈనెల 27న తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు. ఈ ఆర్థిక లావాదేవీల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఏంటి? ఈ నిధులకు సంబంధించిన ఆస్తుల వివరాలేమిటి అనే కోణంలో సుదీర్ఘంగా ప్రశ్నించనున్నారు.

**ఈడి ఎంట్రీ..**

భారీగా నగదు చేతులు మారినట్లు తెలియడంతోనే ఈడి ఎంట్రీ ఇచ్చింది. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా ప్రారంభమైన ఈ దర్యాప్తులో ఈడి ఇప్పటి వరకు 56 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. 160 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసింది. బాధితుల నుంచి వసూలు చేసిన కోట్ల రూపాయల నల్లధనాన్ని సంస్థ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, ఇతరులు పక్కదారి పట్టించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర పై ఆధారాలు లభిస్తుండడంతో విచారణ వేగవంతం అయ్యింది. ఇది పక్కా రాజకీయ - రియల్ ఎస్టేట్ దందా అని ప్రచారం నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేరు బయటకు రావడం సంచలనంగా మారింది. ఈడి దర్యాప్తులో బయటపడిన డిజిటల్ సాక్షాలు, వాట్సాప్ చాట్ లు, ఇప్పటికే అరెస్టయిన డైరెక్టర్లు ఇచ్చిన వాంగ్మూలాలు ఈ రాజకీయ రియల్ ఎస్టేట్ ముఠా బంధాన్ని బయటపెడుతున్నాయి. సాహితీ గ్రూప్ వసూలు చేసిన నగదులు దాదాపు 200 కోట్లకు పైగా నల్లధనాన్ని వేర్వేరు బినామీల పేరుతో.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లోకి... భూముల కొనుగోలుకు మళ్ళించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈడి కోట్ల రూపాయల విలువచేసే విలువైన ఆస్తులను జప్తు చేసింది.

# మేయర్‌గా వంగవీటి!



ఆయనకు హామీ లభించిందా? అందుకే ఆయన తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కలిసారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. తాజాగా వంగవీటి రాధాకృష్ణ పవన్ కళ్యాణ్ ను కలిశారు. కీలక చర్చలు జరిపారు. ప్రజారాజ్యం పార్టీ నాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. సమకాలీన రాజకీయ అంశాలపై ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ మంత్రిత్వ శాఖలో జరుగుతున్న కీలక నిర్ణయాలు, ఇతరత్రా అంశాలను ప్రస్తావిస్తూ వంగవీటి రాధాకృష్ణ ప్రత్యేకంగా అభినందనలు తెలిపినట్లు తెలుస్తోంది. పనిలో పనిగా విజయవాడ మేయర్ పదవికి సంబంధించి పవన్ కళ్యాణ్ ఆశీర్వాదం తీసుకున్నట్టు కూడా టాక్ నడుస్తోంది.

**ఆశావాహులు అధికం..**

అక్టోబర్ మొదటి వారంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ప్రకటించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసుకుంటుంది. మరోవైపు రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్న విజయవాడ మేయర్ కోసం ఇప్పటినుంచే ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. చాలామంది పేర్లు తెరపైకి వస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు కుమారుడు సిద్ధార్థ పేరు ప్రముఖంగా వినిపించింది. ఆయన తన తండ్రితో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ను కలిశారు. బయోడేటా కూడా సమర్పించారు. బోండా ఉమామహేశ్వరరావు సీనియర్ నేత. బలమైన వాయిస్ వినిపిస్తున్నారు పార్టీ తరఫున. మంత్రి పదవి ఆశించారు కానీ దక్కలేదు. ఆయనలో ఉన్న అసంతృప్తిని గుర్తించి అధిష్టానం ఆయన కుమారుడికి మేయర్ పదవి ఆఫర్ చేసినట్లు ప్రచారం నడిచింది.

**ప్రముఖంగా రాధాకృష్ణ పేరు..**

అయితే ఇప్పుడు వంగవీటి రాధాకృష్ణ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. 2019 ఎన్నికలకు ముందు అనూహ్యంగా తెలుగుదేశం పార్టీలోకి వచ్చారు రాధాకృష్ణ. ఆ ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రచారం చేశారు. కానీ పార్టీ ఓడిపోయింది. అయినా సరే ఐదేళ్లపాటు టిడిపిలో కొనసాగుతూ వచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వంగవీటి రాధాకృష్ణకు తప్పకుండా పదవి వస్తుందని అందరూ అంచనా వేసుకున్నారు. నామినేటెడ్ పదవి సైతం దక్కుతుందని భావించారు. కానీ ఎప్పటికప్పుడు అంచనాలు మారుతున్నాయి. అయితే ఇప్పుడు విజయవాడ నగర మేయర్ గా వంగవీటి రాధా పేరు వినిపిస్తోంది. నేరుగా ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో రాధాకృష్ణ అయితే బాగుంటుందన్న అభిప్రాయం టిడిపి వర్గాల్లోనూ ఉంది.

**జనసేన సైతం..**

విజయవాడ మేయర్ పీఠాన్ని జనసేన ఆశిస్తున్నట్లు కూడా ప్రచారం నడుస్తోంది. గత ఎన్నికల్లో విజయవాడ నుంచి జనసేనకు ప్రాతినిధ్యం లేదు. పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన తరఫున పోతిన మహేష్ బరిలో దిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ ఆ సీటు పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించడంతో సుజనా చౌదరి పోటీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోతిన మహేష్ వైసీపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో జనసేనకు అవకాశం రాకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పదవి కోసం పట్టుపట్టే అవకాశం ఉంది. ఆ కారణంతోనే వంగవీటి రాధాకృష్ణ పవన్ కళ్యాణ్ ను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. తనకు టిడిపి మేయర్ అభ్యర్థిగా రంగంలోకి దించితే.. మద్దతు తెలపాలని అభ్యర్థించినట్లు సమాచారం. దీనిపై పవన్ కళ్యాణ్ సానుకూలంగా ఉన్నట్లు కూడా తెలుస్తోంది. కూటమి ఉమ్మడి మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ రంగంలోకి దిగడం ఖాయమని ఆయన అనుచరులు ప్రచారం చేస్తున్నారు. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# షర్మిల తో పూర్తిగా కటీఫ్!

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కానీ ఇంతటి వేడుకలకు బాధ్యతగా వెళ్లాల్సిన ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం గైర్హాజరయ్యారు. ఆయన కేవలం షర్మిల సోదరుడు మాత్రమే కాదు. వధువు అంజలి రెడ్డికి మేనమామ. భారతీయ వివాహ వ్యవస్థలో మేనమామ పాత్ర కీలకం. చెల్లెలిపై ఉన్న కోపంతో సొంత మేనకోడలి జీవితంలో అత్యంత కీలకమైన వేడుకలకు జగన్ గైర్హాజరు కావడం ఆయన కుటుంబ వ్యవహారం మాత్రమే కాదు. ఆయన నాయకత్వ లక్షణాలపై పడుతున్న పెద్ద మచ్చ కూడా. పెద్దల మధ్య ఎంతటి ఆర్థిక, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ.. ఇంటి ఆడపడుచు పిల్లల శుభకార్యాలకు వచ్చేసరికి పాత పగలను పక్కన పెట్టడం తెలుగు సంస్కృతిలో భాగం. కానీ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై వధూవరులను ఆశీర్వదించిన చోట.. రక్త సంబంధీకుడైన మేనమామ జగన్ కనీసం అటువైపు చూడకపోవడం.. ఆయనలో ఉన్న కఠిన వైఖరిని ఎత్తిచూపుతోంది.

**పిల్లల విషయంలో తగదు..**

షర్మిల తో జగన్మోహన్ రెడ్డికి విభేదాలు ఉన్నాయి. తన రాజకీయ అవకాశాలను షర్మిల గండి కొట్టారు. తన రాజకీయ పతనాన్ని కోరుకున్నారు. అంతవరకు కోపం ఉండవచ్చు. కానీ ఏ పాపం ఎరుగని పిల్లల మీద పడనివ్వకూడదనే కనీస విచక్షణను జగన్మోహన్ రెడ్డి మరిచిపోయారన్న విమర్శలు ఉన్నాయి. హిందూ వివాహ వ్యవస్థలో మేనమామ స్థానానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. సాంప్రదాయ బద్ధంగా మేనకోడలి వివాహ వేడుకల్లో మేనమామ చేతులమీదుగా జరిగే ప్రధాన క్రతువులు, ఆశీర్వాదాలు ఎంతో పవిత్రమైనవి. గతంలో తన కుమారుడు రాజారెడ్డి వివాహ సమయంలో షర్మిల స్వయంగా తాడేపల్లి కి వెళ్లి జగన్మోహన్ రెడ్డిని ఆహ్వానించినప్పుడు.. ఆయన అరకొరగానే హాజరై మామ అనిపించేసారు. తరువాత పెళ్లికి హాజరు కాలేదు. ఇప్పుడు షర్మిల కుమార్తె నిశ్చితార్థ వేడుకకు కూడా ముఖం చాటేసారు. డిసెంబర్ లో జరగనున్న వివాహ వేడుకలకు హాజరుకాను అంటూ సంకేతాలు ఇచ్చారు.

**శుభకార్యాలకు సైతం..**

రాజకీయంగా రాష్ట్రంలో అతిపెద్ద కుటుంబం వైయస్సార్ కుటుంబం. కానీ ఆ కుటుంబంలో కనీసం శుభకార్యాలకు కూడా హాజరు కాలేని విధంగా రాజకీయాలు మారిపోయాయి అని అభిమానులు బాధపడుతున్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ఆయనకు కుటుంబం అండగా నిలిచింది. రాజశేఖర్ రెడ్డి మరణం సమయంలో కూడా జగన్మోహన్ రెడ్డికి ఆ కుటుంబం అండగా నిలిచింది. జగన్మోహన్ రెడ్డి కొత్తగా పార్టీ ఏర్పాటు చేసినప్పుడు, పాదయాత్ర చేసినప్పుడు ఆ ఫ్యామిలీ అహోరాత్రులు శ్రమించింది. ఇక విజయమ్మతో పాటు షర్మిల విషయం చెప్పనవసరం లేదు. అంతలా కష్టపడ్డారు కూడా. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కరిని దూరం చేసుకున్నారు జగన్. ఇప్పుడు వారితో ఉన్న వ్యక్తిగత సంబంధాలను కూడా తెంచుకుంటున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి హత్య కేసు పరిణామాల నుంచి మొదలుకుని ఆస్తుల కేసుల వరకు కుటుంబ మొత్తాన్ని వదులుకొని రాజశేఖర్ రెడ్డి అభిమానులకు తీవ్ర ఆవేదనను మిగిల్చుతున్నారు జగన్.

# వరంగల్‌కు వరాల జాబితా..

## సీఎం రేవంత్ వద్ద కడియం కావ్య కీలక ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 25: వరంగల్ అభివృద్ధికి మరో అడుగు ముందుకు పడేలా కీలక అంశాలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలన్న లక్ష్యంతో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. నగరానికి ఒకటి కాదు.. విద్య, నైపుణ్యం, చరిత్ర, కేంద్ర ప్రభుత్వ సేవలకు సంబంధించిన పలు ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం నుంచి నిధులు, సంస్థలు తీసుకురావడంతో పాటు వరంగల్ ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలను మరింత విస్తరించాలన్న అంశాలను వినతిపత్రాల రూపంలో వివరించారు. ముఖ్యంగా కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను త్వరగా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కావ్య కోరారు. ఈ నిధులతో యూనివర్సిటీలో విద్య, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేసే అవకాశం ఉంటుందని వివరించారు. జఅదే సమయంలో కాకతీయుల చారిత్రక వైభవానికి గుర్తుగా నిలిచిన వరంగల్ కోటలోని పురావస్తు మ్యూజియం అభివృద్ధి అంశాన్ని కూడా సీఎం ముందుంచారు. ప్రస్తుత మ్యూజియం భవనం పాతబడిపోయిన నేపథ్యంలో కొత్త భవనం పూర్తయినా.. కళాఖండాల తరలింపు, భద్రత, ప్రదర్శన, పరిరక్షణ, వాతావరణ నియంత్రణ వంటి పనులు ఇంకా చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. వరంగల్ యువతకు ఉపాధి, సాంకేతిక శిక్షణ అవకాశాలు పెంచే దిశగా నైలిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ ప్రతిపాదించారు.




# రాజగోపాల్ రెడ్డి కృషి ఫలించింది..

## చౌటుప్పల్‌కు రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు:

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిలకు కృతజ్ఞతలు

## చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి



**క్రైమ్ మిర్రర్ యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** చౌటుప్పల్‌కు రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిలకు చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 200కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుందని, యాదాద్రి భువనగిరి జిల్లాకు 7కోర్టులను కేటాయించారని తెలిపారు. అందులో చౌటుప్పల్ కోర్టుకు ప్రత్యేకంగా రెండు నూతన కోర్టులను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రజలకు న్యాయసేవలను మరింత చేరువ చేసేందుకు ఇంతటి ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, హైకోర్టు న్యాయవ్యవస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా చౌటుప్పల్ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి, చౌటుప్పల్ కోర్టుకు రెండు అదనపు కోర్టుల మంజూరుకు అంగీకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంత న్యాయవాదులు, ప్రజల చిరకాల విజ్ఞప్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కోర్టుల మంజూరు కోసం నిరంతరం కృషి చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కొత్త కోర్టుల ఏర్పాటుతో కేసుల విచారణ వేగవంతం కావడమే కాకుండా, చౌటుప్పల్, పరిసర ప్రాంతాల ప్రజలకు, స్థానిక న్యాయవాదులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందన్నారు. ఈ ప్రాంత న్యాయప్రక్రియలో ఒక మైలురాయిగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు.



# గణపయ్యకు ఘన వీడ్కోలు!

## జై గణేశ్ నినాదాలతో దద్దరిల్లిన టెంపుల్ సిటీ..

## డప్పుల దరువులతో హోరెత్తిన శోభాయాత్ర

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:-** గుండాల మండలంలోని టెంపుల్ సిటీలో వినాయకుడి శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగింది. గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమైన శోభాయాత్రకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డప్పుల మోతలు, భక్తి గీతాలు, జై గణేశ్ నినాదాలతో టెంపుల్ సిటీ వీధులు మార్మోగాయి. యువత ఉత్సాహంగా పాల్గొనగా.. మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గిరికత్తుల శీను, కుంచాల అంజిరెడ్డి ,ఆవుల సురేందర్,సుధగాని బాలకృష్ణ,ఆవుల శీను,సుధగాని యాదగిరి,ఆవుల చంద్రయ్య,ఆవుల సాయితేజ, ఆవుల శివకుమార్, బొల్లం శ్రీహరి, భిక్షం, రాసుకుచ్చుల లక్ష్మినారాయణ, బొల్లం రాజు, దాసి సోమన్న, ఆవుల శీనువాస్, ఆవుల సదానందం, ఆవుల శీను,తదితరులు పాల్గొన్నారు.

# కొంగర గ్రామంలో భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ తో కలిసి పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు కొడాలి గోవింద రావు

### రీసర్వే పై మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి రైతులు కృతజ్ఞతలు చెపుతున్నారు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లి మండలం కొంగర గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వేను ఖమ్మం కలెక్టర్ దివాకర టీఎస్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవిందరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన రైతుల తరపున కలెక్టర్ కు పలు అంశాలను వివరించారు.అనంతరం గోవింద రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూముల రీసర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు.మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూముల రీసర్వే ను ఒక మానస పుత్రిక లాగా భావిస్తున్నారని రైతుల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ అలాంటిదని ఆయన పేర్కొన్నారు. రీసర్వే పై రైతుల నుంచి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు.రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దులు, వివరాలు నమోదు చేస్తున్నారని, సర్వే సమయంలో పక్కన భూముల రైతులు కూడా ఉంటున్నారని ఆయన తెలిపారు. సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. భూముల రీ సర్వేకు మిగతా రైతులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి (చిట్యాల ) ఐలమ్మ 131 వ జయంతి ఉత్సవాల కమిటీ

## వైస్ చైర్మన్ గా రాచకొండ రమేష్ ఎంపిక .




**క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం:-** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వీరనారి చాకలి ఐలమ్మ 131 జయంతి ఉత్సవాల కమిటీ జీ.వో ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి రజక వృత్తిదారులకు ఎన్నో రోజుల నుంచి సేవ చేస్తున్న నారాయణపురం మండల కేంద్రానికి చెందిన రాచకొండ రమేష్ ని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే జయంతి ఉత్సవాల కమిటీలో వైస్ చైర్మన్ గా ఎంపిక చేశారు. ఈ నేల 26 శనివారం రోజున రవీంద్రభారతిలో జయంతిఉత్సవాలు జరుగును తెలిపారు. జయంతి ఉత్సవాల కమిటీకమిటీ కి నన్ను వైస్ చైర్మన్ గా ఎంపిక చేసిన రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రజక కార్పొరేషన్ చైర్మన్ దాసరాజుల అజయ్ కుమార్ కి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతు 26 తారీకు శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఉత్సవాల సభకు పెద్ద ఎత్తున రజకులను తరలిస్తున్నమని తెలిపారు.

# సహజ వ్యవసాయంతోనే పర్యావరణ పరిరక్షణ,స్థిరమైన అభివృద్ధి

## మిత్రా ఫౌండేషన్ అధ్యక్షులు నిమ్మల రామచంద్రయ్య



**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** రైతు ఆరోగ్యం, నేల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధించడమే లక్ష్యంగా గ్రామీణ స్థాయిలో సహజ వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని మిత్రా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మల రామచంద్రయ్య పిలుపునిచ్చారు.జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలోని ప్రముఖ రైతు ప్రముకరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న 5 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శిక్షణా శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నిమ్మల రామచంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వ్యవసాయ విధానాల ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట దిగుబడులు సాధించవచ్చుని, ఇది రైతులకు ఆర్థికంగానూ, ఆరోగ్యపరం గానూ ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. 5 రోజుల శిక్షణ కార్యక్ర మంలో భాగంగా సహజ వ్యవసాయ పద్ధతులు, కూరగాయల సాగు, మోడల్ డెమో ఫార్మ్ నిర్వహణ, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు, రైతులకు అందించాల్సిన సాంకేతిక సూచనలపై ప్రాయోగిక శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. స్థిరమైన జీవనోపాధికి, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పరిసరాలను అందించడానికి సహజ సాగు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూజ, హార్టికల్చర్ అధికారి కవిత, మండల పశువైద్య అధికారి బాలకృష్ణ, జిల్లా కో-ఆర్డినేటర్ విక్రమ్, బీకీపింగ్ కో-ఆర్డినేటర్ రాజేష్, ప్రతినిధి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని నిమజ్జనానికి తరలి వెళ్లేటప్పుడు మండప నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి



## కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గల హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ మాట్లాడుతూ నవరాత్రులు పూజలందుకున్న పార్వతి పుత్రుణ్ణి నిమర్జన కార్యక్రమంలో రాత్రి వేళల్లో జాగ్రత్తగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుం డా మండప నిర్వాహకులు చుకోవాలని, కమిటీ సభ్యుల భాద్యతగా తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా పోలీస్ అధికారులకు సహకరించి విజ్ఞేశ్వరుని ఆనందంగా సాగనంపాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండపం కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడు సేవలో కూకట్ పల్లి బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా

## పలు మండపంలో ప్రత్యేక పూజలు...అన్నదాన కార్యక్రమం




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కెపిహెచ్బి కాలనీ 3వ ఫేస్ ఎల్ఐసి ఫ్లాట్స్ లో వీబీఎస్ పంతులు, వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో శ్రీ వినాయక నవరాత్రుల సందర్భంగా ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ కూకట్ పల్లి కో ఆర్డినేటర్ సతీష్ ఆరోరా విచ్చేసి వినాయక స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మండప నిర్వాహకులు సతీష్ అరోరా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ అరోరా మాట్లాడుతూ వినాయక నవరాత్రులు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడంతోపాటు, ప్రజల్లో ఐక్యత సోదర భావాన్ని సేవాస్ఫూర్తిని పెంపొందింప చేస్తుందని ఈ సందర్భంగా అయన తెలిపారు. గణనాథుని ఆశీస్సులు ప్రజలు పై ఎల్లవేళలా ఉండాలని ఆ విఘ్నేశ్వరుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాతూరి గోపి, గోర్తి రాజేష్ రాయ్, వలవల నాయుడు, బి.రవి, వెంకట్ నారాయణ, సత్యనారాయణ, చైతన్య, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** ఉమ్మడి వరంగల్ జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 27న (ఆదివారం) జరగనున్న నేపథ్యంలో మంగపేట మండలానికి చెందిన ఫోటోగ్రాఫర్స్ అందరూ తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మంగపేట ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వడ్లకొండ ప్రవీణ్ కుమార్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సంక్షేమం, భవిష్యత్ హక్కుల సాధన కోసం బలమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్నికల రోజున మండలం నుండి ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొని, ఓటింగ్ ప్రక్రియను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉండే ప్రతినిధులను ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు.. 22వ వార్డులో మహా అన్నదానం





**కోదాడ సెప్టెంబర్ 25 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ పట్టణంలోని 22వ వార్డులో సాక్షి గణపతి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద శుక్రవారం మహా అన్నదానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ తూణం కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు.అంతకుముందు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. అనంతరం భక్తులు, స్థానికులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, వార్డు ప్రజలు కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వార్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.మహా అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తి భావంతో పాటు సేవా స్ఫూర్తిని చాటుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మేకల సందీప్, వెలిశాల పురుషోత్తం, చందా రాజేష్, పొనుగోటి అక్షయ్ తేజ, మణికంఠ, ఉదయ్ సాయి, జానీ, భరత్, వంశీ , అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంజనీపుత్ర ఆధ్వర్యంలో మిన్నంటిన గణనాథుని నిమజ్జనోత్సవం

## సున్నంబట్టివాడలో భక్తిపారవశ్యం.. కన్నులపండువగా శోభాయాత్ర





**మంచిర్యాల సెప్టెంబర్ 25 క్రైమ్ మిర్రర్:** మంచిర్యాల పట్టణంలోని సున్నంబట్టివాడ 100 ఫీట్ల రోడ్డులో అంజనీపుత్ర ఎస్టేట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరణసిద్ధి వినాయకుని నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. నవరాత్రుల సందర్భంగా నిత్యం ప్రత్యేక పూజలు, ధూపదీప నైవేద్యాలతో పాటు భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్‌తో పాటు పలువురు ప్రముఖులను అంజనీపుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ ఘనంగా సన్మానించారు.

**అంగరంగ వైభవంగా శోభాయాత్ర**

శోభాయాత్ర భక్తుల జయజయధ్వానాల నడుమ మిన్నంటింది. హోరెత్తించిన డప్పు చప్పుళ్లు, ఉత్సాహభరిత నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శోభాయాత్రలో ప్రదర్శించిన విచిత్ర వేషధారణలు, మహిళల వినూత్న ఆటపాటలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సున్నంబట్టివాడ 100 ఫీట్ల రోడ్డు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర పట్టణంలోని ముఖ్య వీధుల గుండా ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనానికి గోదావరి తీరానికి తరలించారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేశారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అంజనీపుత్ర ఎస్టేట్స్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించగా, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేశారు.



# గాంధీ నగర్ పరిధిలో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు

### అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, పట్వారీ శశిధర్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని "గాంధీ నగర్ వెల్ఫేర్ ఉ కల్చరల్ అసోసియేషన్" కమిటీ సభ్యులు, కాలనీవాసుల ఆహ్వానంమేరకు ముఖ్యఅతిథి "శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ తో కలిసి "ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు"పట్వారీ శశిధర్ గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తో కలిసి పట్వారీ శశిధర్ మండపనికి విచేయటం స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక డివిజన్ సీనియర్ నాయకులు, కాలనీ పెద్దలు, భక్తులతో కలిసి ఎమ్మెల్యే ఆర్కేపూడి గాంధీ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, ఆశీర్వాదాలు పొంది, స్వయంగా ప్రజలకు, భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగాలని ఆకాంక్షించారు. గణేష్ మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు, స్థానికులు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, యువ కులు, కాలనీవాసులు, మహిళలు, భక్తులు, టీం పట్వారీ భారీ సంఖ్యలో పాల్గన్నారు.

# పాపిరెడ్డి నగర్ లో ఘనంగా వినాయక పూజలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు చిట్టి రెడ్డి శ్రీధర్ రెడ్డి



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని రోడ్డు నంబర్ 4సి బ్లాక్ లోని గడ్డం రాజేశ్వర్ రెడ్డి ఏర్పాటు చేసిన వినాయక మండపానికి వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ కాంటెస్టడు అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డినీ ఇతర నాయకులను వినాయక మండప నిర్వాహకుడు గడ్డం రాజేశ్వర్ రెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆ దేవ దేవుడు మహా విఘ్నేశ్వర స్వామి వారినీ ప్రతీ ఒక్కరిని చల్లగా ఆయురారోగ్యాలతో వుండేలా ఆశీర్వదించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చర్ల రామకృష్ణా రెడ్డి, మాయ రాజయ్య, డాకురి అక్కిరెడ్డి, కర్ల తిరుపతి రెడ్డి, ఎడ్ల సంపత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వంగూరి శరత్ రెడ్డి, వంగర శ్రీనివాస్ రెడ్డి, దొడ్ల సాయి రెడ్డి, అన్నారపు బాల్ రెడ్డి, రాము గౌడ్, ఇతర యువ నాయకులు, వినాయక మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.

# దేశం అంత్యోదయం వైపు వెళ్తుంది

### ఆర్ఎస్ఎస్ ద్వారా సనాతన ధర్మాన్ని దేశం అంతటా వ్యాప్తి చెందింపజేసింది దీన్ దయాల్

### బిజెపి యువమోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, శంషుగూడ, జయనగర్ లో బిజెపి డివిజన్ అధ్యక్షులు తప్ప రఘు ఆధ్వర్యంలో పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక బిజెపి నాయకులతో కలిసి విచ్చేసిన బీజేవైఎం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ దీన్ దయాల్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ దీన్ దయాల్ ఉపాధ్యాయుడు గొప్ప దేశభక్తుడని, రాజకీయ నాయకుడని వారు ప్రబోధించిన ఏకాత్మ మానవతా సిద్ధాంతం ద్వారానే భారతదేశం అన్ని రంగాల్లో పురోగమిస్తుందాని అన్నారు. ఉపాధ్యాయ కోరిక అంత్యోదయం అని గుర్తు చేసుకున్నారు. అంత్యోదయం అంటే ఈ దేశ స్వతంత్ర ఫలాలు దేశ మొదటి పౌరుడు నుండి చివరి పౌరుడి వరకు అందడమే అంత్యోదయం అని వారు చెప్పారు. వారు ఆర్ఎస్ఎస్ ద్వారా సనాతన ధర్మాన్ని దేశం అంతటా వ్యాప్తి చెందించారని గుర్తుచేసుకున్నారు, వారిని ఆదర్శంగా తీసుకొని యువత దేశ అభివృద్ధిలో ముందుకు సాగాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కేశవరావు, రామరాజు, జిల్లా నాయకులు సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, ఆంజనేయులు, నరసింహ చారి, జయప్రకాష్, నరసింహ, లడ్డు, రమేష్, మహిళా నాయకురాలు స్వప్న, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ లడ్డూ వేలం....



క్రైమ్ మిర్రర్ మాదాపూర్:మాదాపూర్ పరిధిలో లో ని గుట్టల బేగంపేట్ లో శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది.(ఎస్ డీ ఎన్ ఆర్)బ్రదర్స్ వారు రూ.35,000/- కు లడ్డూను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.



# 15 వ వార్డు సాయి నగర్ కాలనీలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు సాయి నగర్ కాలనీలో గురువారం సాయంత్రం యువ గణేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడైన శ్రీ గణేశుని ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి హాజరైన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, సందడిగా కొనసాగింది.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల చేయూత



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన సోలిపురం లక్ష్మమ్మ(75) ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం వారి కుటుంబాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి వారి కుమారుడు సోలిపురం కుమారస్వామిరెడ్డికి రాజుపేట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రూ,20000 నగదును ఆర్థిక సహాయంగా అందజేసి వారి కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యడ్లపల్లి నరసింహారావు,బాడిష నాగ రమేష్ మరియు జిల్లా నాయకురాలు కొమరం ధనలక్ష్మి మరియు సీనియర్ నాయకులు బండ్ల మధు,ప్రసాద్,మద్దిపాటి చిన్న, కోడె రాము, పోడెం వెంకట్రావ్,చదలవాడ సాంబశివరావు, కర్రి శ్రీను, సయ్యద్ హుస్సేన్,నిమ్మగడ్డ ప్రవీణ్, ఎండి.కౌసర్ పాష, ముళ్ళపూడి సత్యనారాయణ యూత్ నాయకులు కర్రి రామ్మోహన్, గోగులమూడి తంబి పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

### సొంత నిధులతో ఫ్యాన్లు అందజేసిన ఆశ్వంత్ కుమార్




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ హనుమాన్ నగర్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడి స్కూల్లో ఫ్యా న్లు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అ శ్వంత్ కుమార్ గురువారం ఫ్యాన్ లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫ్యాన్ లు లేక సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసు కుని వెంటనే వారికి అసౌకర్యం కలగకుండా తన సొంత నిధులతో ఫ్యాన్లు అందించానని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ సిబ్బంది బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.అ శ్వంత్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్నుల పండుగగా గణనాథుని ఊరేగింపు

**గణేష్ మహారాజ్ కి జై అంటూ మర్మోగిన పురవీధులు**

**విఘ్నేశ్వరుని శోభయాత్రలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్) :** వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూసాపేట్ నవ యువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు నిమజ్జనానికి తరలిన శోభయాత్ర స్థానికులను ఆకట్టుకుంది. నవ యువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభ యాత్రతో మూసాపేట్ లోని పలు వీధులు భక్తి నామస్మరణతో పులకించిపోయాయి. విఘ్నేశ్వరుని శోభాయాత్రలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శోభ యాత్రను ప్రారంభించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభ యాత్రను ప్రారంభించారు. నిమజ్జనానికి తరలి వెళ్తున్న వినాయకుడికి అడుగడుగున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోబయాత్రలో యువకులు ఉత్సాహంగా చేసిన నృత్యాలు పలువురిని ఆలరించాయి. అందంగా అలంకరించిన శోభయాత్రను అసోసియేషన్ సభ్యులు భక్తిశ్రద్ధలతో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తూ భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. తొమ్మిది రోజులు విశేష పూజలు అందుకున్న వినాయకుడిని గంగమ్మ ఒడికి సాగనంపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ రావు, తూము వేణు, నర్సింగ్ రావు, శ్రీనివాస్, బాబు రావు, వేణు, శ్యామ్, రాము, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ్ నగర్‌లో ఘనంగా గణనాథుని పూజలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా**

**బాలానగర్, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్ నగర్‌లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కళ్యాణ్ నగర్ వాసుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ బాలానగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా వినాయక మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక మండపం వద్ద భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహమ్మద్ ఖాజాను కళ్యాణ్ నగర్ వాసులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవాల ప్రాముఖ్యతను, భక్తి భావంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, మహిళా నాయకురాలు స్వాతి, స్వామి, చారి తదితరులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో కళ్యాణ్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## మతసామరస్యానికి ప్రతీకగా రాజు కాలనీ వినాయక చవితి వేడుకలు



**బాలానగర్, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్):** బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీలో వినాయక చవితి వేడుకలు కులమతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా ఘనంగా సాగుతున్నాయి. గణనాథుడిని కేవలం ఒక మతానికి పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాలను ఏకం చేసే పవిత్ర పండుగగా స్థానిక ప్రజలు భావిస్తూ ఏటా ఐక్యతను చాటుతున్నారు.దుర్గ యూత్ ఆధ్వర్యంలో రాజు కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి స్థానిక ముస్లిం మైనారిటీ పెద్దలు తమవంతు పూర్తి సహాయ సహకారాలు అందించారు. మండపం ఏర్పాటు మొదలుకొని భక్తులకు మంచినీరు, ప్రసాదాల పంపిణీ వరకు ప్రతి విషయంలోనూ ముస్లిం సోదరులు చురుగ్గా పాల్గొని.. కుల, మత, పేద, ధనిక అనే తేడాల్లేకుండా రక్షణ బాధ్యతలను సైతం భుజాన వేసుకుని సోదరభావాన్ని చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకుడు మాక్బూల్ మాట్లాడుతూ... “మనమంతా ఒక్కటే. మానవత్వమే మన మతం. హిందూ, ముస్లింలమని వేర్వేరుగా చూడకుండా అందరూ సోదరభావంతో, ఐక్యతతో కలసిమెలసి జీవించాలి” అని ఆకాంక్షించారు. భాగస్వాములై, సేవాలత్పరత చూపిన ముస్లిం సోదరులను నిర్వాహకులు స్థానిక కాంగ్రెస్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, న్యాయవది ఎల్ఎస్ రావు సమక్షంలో శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గొప్పగోని శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్, రూపాన్ని మధు, వెంకటేష్ గౌడ్ (ఎన్టిఆర్), మహంకాళి శ్రీనివాస్, రఫీక్, మహంకాళి సూరి, ఆంజనేయులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.1 కోట్ల లావాదేవీపై గాంధీ వివరణ

**2018లో కార్యాలయ స్థలం కోసం చెల్లించిన మొత్తమే తిరిగి వచ్చింది...**

**సాహితీ సంస్థ కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని స్పష్టీకరణ.....**



**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** సాహితీ సంస్థ నుంచి రూ.2.1 కోట్లు తమ ఖాతాలోకి వచ్చినట్లు మీడియాలో జరుగుతున్న ప్రచారంపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివరణ ఇచ్చారు. ఈడీ నోటీసు అంశంపై మీడియాలో కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాస్తవాలను గమనించాలని మీడియా మిత్రులను కోరారు.సాహితీ సంస్థ నుంచి తమకు రూ.2.1 కోట్లు వచ్చాయని ప్రచారం జరుగుతున్నప్పటికీ.. వాస్తవానికి ఆ మొత్తాన్ని తాము 2018లోనే కార్యాలయ స్థలం కోసం సదరు సంస్థకు తమ ఖాతా ద్వారా చెల్లించినట్లు గాంధీ తెలిపారు. అయితే కార్యాలయ స్థలాన్ని కేటాయించలేకపోవడంతో సదరు సంస్థ ఆ మొత్తాన్ని తిరిగి తమ ఖాతాలోకి జమ చేసిందని వివరించారు.ఈ లావాదేవీకి సంబంధించిన వాస్తవాలను మీడియా దృష్టికి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. సాహితీ సంస్థ కార్యకలాపాలు, ఆ సంస్థకు సంబంధించిన ఇతర వ్యవహారాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈడీ నోటీసు అంశంలో వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని వార్తలు ప్రచురించాలని మీడియా మిత్రులను కోరారు.

## బాలాపూర్ మహిమాన్విత లడ్డూను 39 లక్షలకు సొంతం చేసుకున్న ప్రణీత్ రెడ్డి



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) బాలాపూర్ గణనాథుడిని లడ్డూను ఒక తీపి పదార్థంగా కాకుండా సకల శుభాలు, ఐశ్వర్యాన్ని ప్రసాదించే ఒక దివ్యశక్తిగా భక్తజనులు భావిస్తారు. అటువంటి మహిమాన్విత గల బాలాపూర్ గణనాథుడి లడ్డును దక్కించుకోవాలనే లక్ష్యంతో వేలంపాటలో లక్షల్లో పాడి సొంతం చేసుకుంటారు. అటువంటి మహిమాన్విత గల లడ్డును ఈ యేడు వనస్థలిపురం సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి వేలంపాటలో 39 లక్షలకు సొంతం చేసుకున్నారు. 1994 సంవత్సరంలో 450 రూపాయలతో మొదలైన లడ్డు వేలం పాట ప్రతిఏటా అంచలంచలుగా పెరుగుతూ ఈ సంవత్సరం 39 లక్షలకు చేరింది. దేశంలోనే కాక ప్రపంచమంతా ఎంతో ఉత్కంఠ గా ఎదురుచూసే బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం పాట విశేష భక్త జన సందోహంలో సామ ప్రణీత్ రెడ్డి, మర్రి రవి కిరణ్ రెడ్డి, కందాడ శాలిని వీరేందర్ రెడ్డి, కంచర్ల శివారెడ్డి, సామ దయానంద రెడ్డి మరియు సామ వరనందరెడ్డి, గడ్డం నవీన్ రెడ్డి, పి ఎస్ కే గ్రూప్ శ్రీకాంత్, ఇబ్రాం ప్రత్యూష్ వేలంపాటలో పాల్గొన్నారు. గత సంవత్సరం ఈ గణనాథుడి లడ్డూను లింగాల దశరథ గౌడ్ 35 లక్షలకు దక్కించుకున్నారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు రాఘవరెడ్డి, శశిధర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగా రెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా రెడ్డి, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు జంగా రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొలను శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు

**అంగరంగ వైభవంగా ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ నిమజ్జనం**

**రూ.60,999కు ఏకదంతుని లడ్డూను దక్కించుకున్న కాముని శ్రీనివాస్**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్):** ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలతో ఉత్సవాలు సందడిగా సాగాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలం పాటలో ఏకదంతుని లడ్డూను ఉమాదేవి నగర్‌కు చెందిన కాముని శ్రీనివాస్ రూ.60,999కు, మూషిక వాహన లడ్డూను ఆత్మకూరి సంతోష్ రూ.19,016కు దక్కించుకున్నారు. భక్తురాలు అందించిన మరో లడ్డూ లక్కీ డ్రాలో మోకల శంకర్ విజేతగా నిలిచారు. అనంతరం లడ్డూ దక్కించుకున్న వారిని నిర్వాహకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం గణనాథుడిని పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా ఊరేగించి, సూరారం చెరువులో నిమజ్జనోత్సవానికి తరలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ఘన వీడ్కోలు పలికారు. ఉత్సవాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలైన పెద్దలు, పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పేరావేనా సమ్మయ్య యాదవ్, కూరపాటి కరుణాకర్ రాజు, మంకాళి అశోక్ చారి, పొడిచేటి రాములు గౌడ్, మునీందర్ రాజు, గెల్లు శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున యాదవ్, రాధాకృష్ణ యాదవ్, బొల్లెపల్లి సూర్యరాజు, కండక్టర్ శంకర్, బాజారావు, కురువ నర్సింహులు, రమేష్ యాదవ్, సాయి కృష్ణ యాదవ్, శివకుమార్, యాదగిరి, కిరణ్ చారి, నాగేష్, చిన్న రమేష్, తిరుపతి యాదవ్, రాజేష్, క్రాంతి, మహేష్ గౌడ్, రోహిత్ గౌడ్, శ్రీకాంత్, నల్ల సత్యనారాయణ, కుమార స్వామి, యూత్ సభ్యులు వరుణ్ కృష్ణ, చరణ్ కృష్ణ, అఖిలేష్, లోకేష్, విగ్నేష్, కాముని విశాల్, సాయి రామకృష్ణ, శ్రీ హరి నారాయణ తోపాటు మహిళలు పద్మావతి, కల్పనా, కళావతి, లక్ష్మి, ఎం.లక్ష్మి, శైలజరాణి, సుధారాణి, నవీనా, హేమలత, శ్రీలత, అనిత తదితరులు పాల్గొన్నారు.

## అందరూ ఉండి... అనాథగా అంత్యక్రియలు!

**కన్నీటి బంధాలు ఉన్నా.. కడసారి పంపేందుకు ఆర్థిక స్థోమత లేకపోయింది**

**మాణిక్యరావుకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించిన ఎండీఆర్ ఫౌండేషన్**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25:** అందరూ ఉన్నా.. కడసారి పంపించేందుకు ఆర్థిక స్థోమత లేక ఓ కుటుంబం దిక్కుతోచని స్థితిలో నిలిచింది. మూడు రోజుల క్రితం చింతలచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లాదుర్గం గ్రామానికి చెందిన మాణిక్యరావు మృతి చెందారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునే మాణిక్యరావు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆయన భార్య కూడా వికలాంగురాలు కావడంతో కుటుంబ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మాణిక్యరావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా కుటుంబ సభ్యుల వద్ద ఆర్థిక స్థోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న ఎండీఆర్ ఫౌండేషన్ స్పందించింది. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మృతదేహాన్ని పటాన్‌చెరువుకు తరలించి, మాణిక్యరావుకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించింది. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటిన ఎండీఆర్ ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు.

# రైతు రిజిస్ట్రేషన్‌కు గడువు సెప్టెంబర్ 30

**ఫార్మర్ ఐడీతో ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు సులభతరం**

**రైతు వేదికలు, మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి**

**జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్**




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25:** జిల్లాలోని రైతులందరూ రైతు రిజిస్ట్రేషన్, ఫార్మర్ ఐడీ కోసం సెప్టెంబర్ 30లోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్ సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ ద్వారా రైతులకు అందే ప్రభుత్వ పథకాలు, సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు భూములు, పంటలు, ఎరువులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు.ఫార్మర్ ఐడీ ద్వారా వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల కొనుగోళ్లలో కనీస మద్దతు ధర పొందడం, ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయడం, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను రైతులు సులభంగా పొందవచ్చని తెలిపారు. రైతులు తమ సమీప రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి ను సంప్రదించి లేదా సంబంధిత మీసేవ కేంద్రంలో ఫార్మర్ ఐడీ కోసం నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు సమయంలో ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ వెంట తీసుకురావాలని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 30లోగా ఫార్మర్ ఐడీ కోసం నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ ప్రసాద్ కోరారు.

# ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందాలి





## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### తల్లులు, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### జిల్లా కలెక్టర్ కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25:** ప్రతి చిన్నారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. 9వ పోషణ మాసం సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం 'మన అంగన్వాడీ--మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి పౌష్టికాహారం, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోషణపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని తల్లులకు సూచించారు. పిల్లల ఎత్తు, బరువును ప్రతి నెలా నమోదు చేసి, వారి ఎదుగుదలకు అనుగుణంగా పోషకాహారం అందించాలని తెలిపారు. చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలకు బేబీ వెయింగ్ మిషన్లను పంపిణీ చేయడంతో పాటు గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల, వినికిడి, మాట, నడక తదితర సమస్యలను గుర్తించిన వెంటనే వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. పోషణ లక్ష్యాల సాధనకు మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



## జీపీల వారీగా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు

### గ్రామ అవసరాలకు అనుగుణంగా వీజీపీపీలను పకడ్బందీగా సిద్ధం చేయాలి



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25:** గ్రామపంచాయతీల స్థానిక అవసరాలు, వనరులు, మౌలిక వసతులు, లోటుపాట్లను గుర్తించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక లో నీటి భద్రత, నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులు, ఉపాధి, జీవనోపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులతో వీజీపీపీపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో వాస్తవంగా అవసరమైన పనులను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలో చేర్చాలని పాండు సూచించారు. చెరువుల పునరుద్ధరణ, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, ఫారం పాండ్లు వంటి పనులను అవసరమైన ప్రాంతాల్లో చేపట్టాలని అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ఉపాధి హామీ పనులు ముందుగానే గుర్తింపు:** ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ కూలీలకు నిరంతరం పనులు అందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. రైతులకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, మత్స్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనులను గుర్తించాలని పాండు తెలిపారు. ఒకే పని వివిధ శాఖల ద్వారా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరదలు, కరువు వంటి ప్రకృతి విపత్తుల ప్రభావాలను తగ్గించే పనులను కూడా ప్రణాళికలో చేర్చాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, డీపీఓ మల్లారెడ్డి, అదనపు డీఆర్డీఓ బాలరాజు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ లడ్డూ వేలం....



మాదాపూర్:మాదాపూర్ పరిధిలో లో ని గుట్టల బేగంపేట్ లో శ్రీ గణేష్ గల్లీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది.గాయత్రీ డిజిటల్ ప్రింట్స్ వారు రూ.58,000/- కు లడ్డూను సొంతం చేసుకున్నారు.ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

# పాలమూరు నీటికి అన్యాయం చేయొద్దు

### డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి.. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

### పాలకులు మారుతున్నా.. పాలమూరు దశ మాత్రం మారడం లేదు

### పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల జేఏసీ



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** పాలమూరు ప్రాంతాన్ని ఎడారిగా మార్చేలా ఉన్న డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి చైర్మన్ రాజేందర్ రెడ్డి, బెక్కం జనార్ధన్, కన్వీనర్ రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాల పోరాటం అనంతరం సాధించుకున్న పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నీటిని అక్రమంగా నల్లగొండకు తరలించేలా డిండి లిఫ్టును రూపొందించడం పాలమూరు ప్రాంతానికి అన్యాయం చేయడమేనని అన్నారు. అసంపూర్తిగా ఉన్న రాజోలి బండ, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు తదితర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. పాలకులు మారుతున్నా పాలమూరు ప్రాంత భవిష్యత్తు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, రిటైర్డ్ తహసీల్దార్ చిన్న కృష్ణయ్య, జేఏసీ నాయకులు లింగస్వామి, బండెల రామచంద్రారెడ్డి, కానుగుల జంగయ్య, అడ్వకేట్ వెంకట్ గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాల అందజేత....**


ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి శుక్రవారం ప్రజాకవి, భక్తకవి, రచయిత కర్నాటి రఘురాములు గౌడ్ రచించిన 'శ్రీ వేంకటేశ్వర స్తుతి' పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకంలో ఆధ్యాత్మికత, సన్మార్గం, పరోపకారం, విద్య గొప్పతనం, యోగ, ఉత్తమ సంస్కారం, కర్మఫలాలు తదితర అంశాలను పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, మంచి ఆలోచనా విధానం, ఉత్తమ ప్రవర్తన పెంపొందించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# గోనేమ్మ బస్తీలో ఘనంగా గణేష్ నవరాత్రి ముగింపు

### తొలిసారి లడ్డూ వేలం.. రూ.1.53 లక్షలకు తొలి లడ్డూ

### రూ.59 వేలు, రూ.30 వేలకు మరో రెండు లడ్డూలు..

### డప్పులు, డ్యాన్సులతో హోరెత్తిన గోనెమ్మ బస్తీ





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** గణేష్ నవరాత్రి ముగింపు సందర్భంగా గోనేమ్మ బస్తీలో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గోనేమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన గణేష్ లడ్డూ ప్రసాదం వేలం రికార్డు ధరలు పలికింది. తొలి లడ్డూను భాశెట్టి ఆదిత్య రూ.1,53,000లకు దక్కించుకోగా, రెండో లడ్డూను నాయి కోటి--సాయి కిరణ్ రూ.59,000లకు, మూడో లడ్డూను పోచారం మనోజ్ రూ.30,000లకు సొంతం చేసుకున్నారు. నవరాత్రి ముగింపు సందర్భంగా గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి బస్తీ పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. చిన్నారుల నృత్యాలు, యువత డ్యాన్సులు, డప్పుల మోతతో బస్తీ మార్మోగింది. మహిళలు, యువత, చిన్నారులు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గణనాథుడిని తిమ్మక్క చెరువు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. లడ్డూ వేలంలో విజేతలుగా నిలిచిన భాశెట్టి ఆదిత్య, నాయి కోటి--సాయి కిరణ్, పోచారం మనోజ్‌లను గోనేమ్మ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బాయికాడి వెంకటేష్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాల విజయవంతానికి బస్తీ పెద్దలు, యూత్ సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, యువత, స్థానికులు సమన్వయంతో సహకరించారు.

# ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, మాదాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ లడ్డూ వేలం....

### రూ.2,11,000/- కు లడ్డూ ను కైవసం చేసుకున్న పహల్వాన్ శ్రీనివాస్, సంజయ్ కుమార్...



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, మాదాపూర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలంలో గణేష్ లడ్డూను పహల్వాన్ శ్రీనివాస్, సంజయ్ కుమార్ రూ.2,11,000/- కు కైవసం చేసుకున్నారు.లడ్డూను దక్కించుకున్న సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేస్తూ గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లడ్డూ గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

## ఆడపిల్ల వివాహానికి అండగా కళ్యాణ లక్ష్మి

### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి :** నాంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఇటీవల మంజూరైన 49 చెక్కులకు గాను అందుబాటులో ఉన్న 46 మంది లబ్ధిదారులకు ఆచెక్కులను తహసీల్దార్ అంబటి ఆంజనేయులు శుక్రవారం పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల వివాహం చేసిన తల్లిదండ్రులు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, పథకం ద్వారా పేద కుటుంబాలకు చెందిన ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తాసిల్దార్ దోటి వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచులు, రెవెన్యూ అధికారులు, వడ్డేపల్లి సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు, వార్డు సభ్యులు జెట్టనబోయిన శంకర్, కళ్యాణ లక్ష్మి చెక్కుల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించిన దళిత సంఘాల నాయకులు



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: కుల్కచర్ల మండల దళిత యువశక్తి వచన సంఘం అధ్యక్షులు కర్రీ భరత్ కుమార్ కన్వీనర్ తుప్పలి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పరిగి శాసనసభ్యులు, టీపీసీసీ( సర్) ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘానికి కావలసిన పలు ముఖ్యమైన అభివృద్ధి విషయాలను గురించి ఎమ్మెల్యే గారికి వివరించారు. ముఖ్యంగా కుల్కచర్ల మండల కేంద్రంలో అంబేద్కర్ భవనానికి స్థలమును కేటాయించాలని, ఆ స్థలంలో అంబేద్కర్ భవనం నిర్మించే విధంగా నిధులు విడుదల చేయాలని వారు సూచించారు. ఈ విషయాలు పై ఎమ్మెల్యే స్పందించి త్వరలోనే పనులను చేపట్టేటట్లుగా వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుప్పలి వెంకటేశం,మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య,సుంకి రెడ్డి కృష్ణ రెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాగని వెంకట్ రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగని ఎల్లయ్య, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ కామునిపల్లి వెంకటయ్య, వార్డు సభ్యులు శివాని ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సాలెటి రవి కుమార్, దళిత యువశక్తి యువజన సంఘం మాజీ అధ్యక్షులు జెట్టిగల్లా వెంకటయ్య, దండు వెంకటయ్య, దళిత యువ శక్తి యువజన సంఘం సలహాదారులు బైండ్ల రాంచెంద్రయ్య,నాగని బిచ్చయ్య, వార్డు సభ్యులు మోత్కూర్ వెంకటేష్, పోతగాళ్ల కృష్ణ, పోతగాళ్ల చిన్న గోపాల్,బక్కని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# గణేష్‌గడ్డలో వైభవంగా పల్లకి సేవ, రథయాత్ర

**సిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25:** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ శ్రీ సిద్ధి గణపతి దేవాలయంలో వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం సాయంత్రం నిర్వహించిన స్వామివారి పల్లకి సేవ, రథయాత్రలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాజగోపురాల నిర్మాణం పూర్తయిందని, సాలహారం పనులు త్వరలో పూర్తికానున్నాయని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 11 రోజులపాటు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన ఆలయ పురోహితులు, కమిటీ సభ్యులు, నిర్వాహకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు, కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఘన స్వాగతం పలికారు.

# ఎన్నికల సంఘంలోని 14 అసమ్మతి లేఖలను బహిర్గతం చేయాలి

**ఓటర్ల జాబితా సవరణపై అభ్యంతరాలు.. వెలుగులోకి వచ్చాయి**

**ఈసీఐ వ్యవహారాలపై నిష్పాక్షిక విచారణ జరపాలి**

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమురళి కృష్ణ డిమాండ్**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25: ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమురళి కృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ప్రచురించిన పరిశోధనాత్మక కథనాన్ని ఉటంకిస్తూ, గత పది నెలల్లో ఓటర్ల జాబితా సవరణ, ఫారం-6లో మార్పులు, ఈసీఐనెట్ కేంద్రీకరణ వంటి కీలక అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కనీసం 14 సార్లు అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. మూడు సభ్యుల రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం ఒకే వ్యక్తి కార్యాలయంగా మారకూడదని అన్నారు. పారదర్శకత కోసం 14 అసమ్మతి లేఖలను తక్షణమే బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ, కేంద్రీకృత సాఫ్ట్‌వేర్ వ్యవహారాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పాక్షిక విచారణ జరపాలని కోరారు. విచారణ పూర్తయ్యే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని బాలమురళి కృష్ణ డిమాండ్ చేశారు.

# రాజన్న టీ కొట్టును ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్న వ్యాపారాలను ప్రోత్సహించాలి**

**వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్ష**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25: పటాన్‌చెరు మండలం ముత్తంగి జీహెచ్‌ఎంసీ పరిధిలో వాసు ఏర్పాటు చేసిన రాజన్న టీ కొట్టు ను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజన్న టీ కొట్టు మంచి అభివృద్ధి సాధించి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. స్థానికంగా చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తలారి ఆంజనేయులు, పటాన్‌చెరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్, రాము, ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, రామకృష్ణ, సురేష్, వివిధ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి .. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ**





**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య లక్షణమని పరిగి ఎమ్మెల్యే టి పి సి సి ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని రైతు వేదికలో బుధవారం కుల్కచర్ల చౌడపూరు మండలాల లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వారు తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవితాలలో వెలుగు నింపుతుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా ప్రతి నాయకులు కృషి చేయాలని వారు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పార్టీ నాయకులకు సూచించారు. అరులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కుల్కచర్ల చౌడపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన 68మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 1,00,116 చొప్పున మొత్తం రూ. 68,07,888 (68 లక్షల 7 వేల 888 రూపాయలు) విలువగల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి ఎమ్మెల్యే కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ 2 అధ్యక్షులు కర్రే భరత్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, పంపంద ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి,చౌడపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు సుంకి రెడ్డి కృష్ణారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్,ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్‌కు జోష్ పెంచాలి

**క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విస్తృతం చేయాలి**

**యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, సెప్టెంబరు 25: యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు యువతను పెద్దఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలని నల్గొండ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి గుర్రం శ్యామ్‌చరణ్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్‌భవన్‌లో శుక్రవారం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అజహరుద్దీన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ కార్యకలాపాలు, పార్టీ బలోపేతం, యువతను మరింతగా భాగస్వామ్యం చేయడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి మరింత విస్తృతంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు. యువతకు చేరువయ్యేలా కార్యక్రమాలను రూపొందించి, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిడుగు పడి మృతి చెందిన కుమ్మరి లక్ష్మి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి సెప్టెంబర్ 25 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలో ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుమ్మరి లక్ష్మీ కుటుంబ సభ్యులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించారు. కుమ్మరి లక్ష్మీ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే తూడి మేగా రెడ్డి .ప్రమాదానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయాన్ని అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఏ సమయంలోనైనా కుటుంబానికి అండగా ఉంటానని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల సమయంలో పొలాలు, చెట్ల కింద ఉండకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. అనంతరం వనపర్తి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి శివ యాదవ్ గారి తండ్రి చనిపోవడం వల్ల వారి ఇంటి దగ్గరికి పోయి ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ డీలర్ బాలస్వామి. మరణ వార్త తెలుసుకొని వారి ఇంటి దగ్గరికి పోయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేర్ టౌన్ కాంగ్రెస్ కొంతం దయాకర్ రెడ్డి. పెబ్బేరు మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, సురేందర్ గౌడ్, మాజీ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్. మార్కెట్ డైరెక్టర్ నరసింహనాయుడు. సూగూరు కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ సాగర్, గంధం రాజశేఖర్, రంజిత్ కుమార్, యుగంధర్ రెడ్డి, అయ్యల్ యాదవ్. వనం మల్లేష్, నందీశ్వర్, నరేందర్ కుమార్, రాముడు, మండగిరి రాముడు చంద్రకాంత్ యాదవ్, మండగిరి రాధాకృష్ణ, చిన్నయ్య, రామలక్ష్మి యాదవ్ స్వామి యాదవ్ వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివ యాదవ్ గారి తండ్రి చనిపోవడం వల్ల వారి ఇంటికి పోయి పరామర్శించడం జరిగింది. అదేవిధంగా మాజీ డీలర్ బాలస్వామి యాదవ్ ఇంటికి పోయి పరమశించారు



# పర్యావరణహిత గణపతుల ప్రోత్సాహం అభినందనీయం


**గణేష్ మండపాన్ని సందర్శించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25: భారతీనగర్ డివిజన్ ఓల్డ్ ఎంఐజీ కాలనీలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస్, ఆయన బృందం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా సహజ మట్టితో పర్యావరణహిత గణేష్ విగ్రహాలను తయారు చేసి ప్రతిష్ఠించడం అభినందనీయమని సింధు ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి గణేష్ విగ్రహాలను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, శ్రీనివాస్, సంపత్ గౌడ్, వినాయక్ రెడ్డి, రాకేష్ రెడ్డి, జమీర్, మిన్ను, కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం

**పోచారం గ్రామంలో ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు**

**భక్తులతో కలిసి పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్**



పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 25: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామంలో శ్రీరామ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు గణపతి బప్పా మోరియా నినాదాలతో ఉత్సాహంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులు అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధి సాధ్యం






ఎం పి డి ఓ రామకృష్ణ శర్మ

**తిరుమలగిరికి త్రాగునీరు అందించండి ప్రజల దాహార్తి తీర్చండి**

**సమస్యలు చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదని మహిళా సర్పంచ్ ఆవేదన**

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధితో మండలం అభివృద్ధి చెందుతుందని నాంపల్లి ఎం పి డి ఓ రామకృష్ణ శర్మ అన్నారు. నాంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధి, సమర్థ్యాబివృది కార్యక్రమాలపై సమీక్ష సమావేశం ఎం పి డి ఓ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎం పి డి ఓ రామకృష్ణ శర్మ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన సమస్యలను ఇప్పటివరకు చాలావరకు పరిష్కరించడం జరిగిందని భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు కొన్ని మాత్రమే మిగిలి ఉన్నాయని, గ్రామ సమస్యలపై ఇకపై గ్రామ స్థాయిలో నిర్వహించే గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలనే పరిష్కరించడం జరుగుతుందని, గ్రామసభ అనంతరం తీసుకొచ్చిన సమస్యలను తర్వాత నిర్వహించే గ్రామసభ దృష్టికి తీసుకొచ్చిన పరిష్కరించడం జరగదని అన్నారు. అనంతరం మండల స్థాయిలోని ఉన్నటువంటి వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు ఆయా శాఖల ద్వారా మండల స్థాయిలో వివిధ గ్రామాలలో జరిగినటువంటి జరుగుతున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాల గురించి క్లుప్తంగా వివరించారు. పలువురు సర్పంచులు అడిగిన సమస్యలకు అధికారులు సమాధానం చెప్తూ సమస్యలు పరిష్కరిస్తామని మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయికి తీసుకెళ్తామని అన్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరి గ్రామ సర్పంచ్ ఇరిగి రాణి మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కారం కావడం లేదని ముఖ్యంగా తాగునీటి సమస్యను ప్రత్యేకంగా అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్లిన సంవత్సరం కాలంగా మిషన్ భగీరథ నీరు గ్రామానికి సరఫరా కావడం లేదని కనీసం వినియోగ నీరు కూడా అందడం లేదని తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, తాను ఒక ఎస్సీ మహిళా సర్పంచ్ కావడంతో అధికారులు తమపై చిన్న చూపు చూస్తున్నారు అనే భావన కలుగుతుందని దీంతో గ్రామంలో ప్రజలు ముందు తాను తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడిందని, తాగునీటి సమస్యకు కారణమైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్యను పరిష్కరించలేని ఎడల తాను గ్రామ ప్రజలతో మండలంలో ధర్నా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో నాంపల్లి తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, ఎం ఈ ఓ అజయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి బండారి శివ, పంచాయతీరాజ్ శాఖ ఏఈ జీవన్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఏ ఈ వెంకటేష్, ఆర్ అండ్ బి ఏ ఈ వికాస్, ఐబి ఏఈ శ్రీధర్, విద్యుత్ ఏఈ శివప్రసాద్ రెడ్డి, ఎంపీవో శోభారాణి, ఉద్యాన శాఖ అధికారి విద్యాసాగర్, హౌసింగ్ ఏఈ గణేష్, ఇంచార్జ్ ఎంపీ ఓ ఏపీవో గుంటుక వెంకటేష్, సిడిపిఓ సక్కుబాయి, అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు షూ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్

**వనపర్తి సెప్టెంబర్ 25 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులకు. సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ ఆధ్వర్యంలో. షూలు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మంచి మాటలను పాటిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ముందుకు సాగాలి. చదువులో రాణించి మన గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు, విద్యాభివృద్ధి, సంక్షేమానికి గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ శేషులు , దుర్గా , దయానంద , విద్యా వాలంటీర్లు, వార్డు సభ్యులు రమేష్, సహదేవుడు, అలీమా, బాబు, గ్రామస్తులు రామన్ గౌడు తదితరులు పాల్గొన్నారు.

## సాయి నగర్ యూత్ అసోసియేషన్ లడ్డూ వేలంలో రికార్డు ధర

**క్రైమ్ మిర్రర్, మాదాపూర్:** మాదాపూర్ పరిధిలోని సాయి నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలంలో గణేష్ లడ్డూను మాణికుమారి రూ.30,00,000/- లకు కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు. అలాగే కలశం చెంబును శశికిరణ్ రూ.3,00,000/- లకు దక్కించుకున్నారు. లడ్డూ, కలశాన్ని సొంతం చేసుకున్న వారిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## వడ్డెర యూత్ అసోసియేషన్ లడ్డూ 1,37,000/-



క్రైమ్ మిర్రర్ మాదాపూర్: మాదాపూర్ డివిజన్ గుట్టల బేగంపేట్ లో వడ్డెర బస్తి లో వడ్డెర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాట ఘనంగా జరిగింది. ఈ వేలంలో గణేష్ లడ్డూను మంజులా రంగయ్య, సాంబయ్య వారి కుటుంబ సభ్యులు రూ.1,37,000/-లి లకు లడ్డు ను దక్కించుకున్నారు. లడ్డూ, సొంతం చేసుకున్న వారిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గణనాథుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

## కోదాడలో 210 కుటుంబాలకు సొంతింటి కల సాకారం!

**ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ**

**వార్డుల వారీగా లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**



**కోదాడ, సెప్టెంబర్ 25 (క్రైమ్ మిర్రర్):** కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతగా మంజూరైన 210 ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డుల వారీగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, స్థిరమైన జీవనానికి పునాది అని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**210 ఇళ్లకు మంజూరు పత్రాలు**

కోదాడ మున్సిపాలిటీ పరిధిలో మొదటి విడతగా మొత్తం 210 ఇళ్లకు మంజూరు పత్రాలు అందజేశారు. వీటిలో 198 సాధారణ కేటగిరీ ఇళ్లు, 12 ప్రత్యేక కేటగిరీ ఇళ్లు ఉన్నట్లు ఎమ్మెల్యే వివరించారు. పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు గృహ నిర్మాణానికి ప్రభుత్వ సహకారం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**వార్డుల వారీగా మంజూరైన ఇళ్ల వివరాలు**

మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు కేటాయించిన ఇళ్ల వివరాలు ఇలా ఉన్నాయి: 1వ వార్డు -- 6, 2వ వార్డు -- 16, 3వ వార్డు -- 3, 4వ వార్డు -- 1, 5వ వార్డు -- 12, 6వ వార్డు -- 8, 7వ వార్డు -- 1, 8వ వార్డు -- 6, 9వ వార్డు -- 5, 10వ వార్డు -- 4, 11వ వార్డు -- 13, 12వ వార్డు -- 1, 13వ వార్డు -- 3, 14వ వార్డు -- 1, 15వ వార్డు -- 7, 16వ వార్డు -- 3, 18వ వార్డు -- 6, 19వ వార్డు -- 11, 20వ వార్డు -- 6, 21వ వార్డు -- 3, 22వ వార్డు -- 6, 23వ వార్డు -- 3, 24వ వార్డు -- 6, 25వ వార్డు -- 3, 26వ వార్డు -- 1, 27వ వార్డు -- 2, 28వ వార్డు -- 2, 29వ వార్డు -- 2, 30వ వార్డు -- 2, 32వ వార్డు -- 6, 33వ వార్డు -- 13, 34వ వార్డు -- 22, 35వ వార్డు -- 14 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.






## సాల్వీడ్ గ్రామంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం సాల్వీడ్ గ్రామంలోని చెంచు కాలనీలో రిలయన్స్ వారు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ ద్వారా కాలనీ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అడ్వకేట్ నరేందర్ యాదవ్, నరసింహులు యాదవ్, యువ నాయకులు ల్యాగల లాలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల పిఎసిఎస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే టిఆర్ఆర్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో శుక్రవారం పిఎసిఎస్ చైర్మన్ భీంరెడ్డి ఆధ్వర్యంలో పిఎసిఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఎసిఎస్ యొక్క కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవలు, సహకార సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించడం జరిగింది. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ారాజూ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్, పాలకవర్గ సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పరిగి డీఎస్పీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో డీఎస్పీ నూతన కార్యాలయాన్ని పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పోలీస్ అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో పరిగి డివిజన్ పోలీస్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి డిఎస్పి శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండల్ రెడ్డి, ఎస్సైలు పలువురు రాజకీయ నాయకులు నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


## లక్షల పదివేలకు గణనాథుని లడ్డూ కైవసం చేసుకున్న మనోహర్ గౌడ్



క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చంగోముల్ గ్రామంలోని హనుమాన్ మందిర్ వద్ద ప్రతిష్ఠించిన శ్రీ గణనాథుని లడ్డూ వేలం కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేలంలో గ్రామానికి చెందిన మనోహర్ గౌడ్ 1,10,000 (ఒక లక్ష పది వేల రూపాయలు) కు శ్రీ గణనాథుని లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణనాథుని లడ్డూ వేలం ద్వారా గ్రామంలో భక్తి, ఐక్యత, సోదరభావం మరింత వెల్లివిరిసింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గ్రామ ప్రజలకు, యువతకు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# కరీనా కపూర్ క్రైమ్ థ్రిల్లర్ 'దయూరా'

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనా కపూర్ ఖాన్ మరియు టాలెంటెడ్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా క్రైమ్ థ్రిల్లర్ 'దయూరా'. ప్రముఖ దర్శకురాలు మేఘనా గుల్జార్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్ డీసీపీ అజూని కోహ్లీగా, పృథ్వీరాజ్ సుకుమారన్ డీసీపీ రామన్ కుమార్‌గా ప్రత్యర్థి పోలీసు అధికారులుగా కనిపించనున్నారు. చట్టం వర్సెస్ న్యాయం, నకిలీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అయిన రామన్ కుమార్‌పై మరో పోలీసు అధికారి అజూని కోహ్లీ దర్యాప్తు చేసే తీవ్రమైన సన్నివేశాలతో ట్రైలర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది. జంగ్లీ పిక్చర్స్ మరియు పెన్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను మేఘనా గుల్జార్ యదార్థ ఘటనల ఆధారిత సీరియస్ డ్రామాగా మలిచారు. సస్పెన్స్ మరియు హై-వోల్టేజ్ డ్రామాతో కూడిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 18న విడుదల కానుండగా, ప్రస్తుతం ఈ ట్రైలర్ సినీ వర్గాల్లో భారీ అంచనాలను పెంచేసింది.





# మూడు సినిమాలతో మమిత బైజు హ్యాట్రిక్

'ప్రేమలు'తో ఒక్కసారిగా యూత్ క్రష్‌గా మారిన మమితా బైజు .. ఇప్పుడు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. తన క్యూట్‌నెస్‌తో కట్టిపడేసే ఈ మలయాళ ముద్దుగుమ్మ.. తాజాగా భారతీయ సినీ చరిత్రలోనే ఎవరూ సాధించని ఒక అరుదైన మైలురాయి చేరుకుంది. కేవలం 29 రోజుల వ్యవధిలో ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు వరుసగా రూ.200 కోట్లకుపైగా వసూలు చేసి.. హ్యాట్రిక్ కొట్టిన తొలి భారతీయ నటిగా చరిత్ర సృష్టించింది. ఎన్నో వాయిదాల తర్వాత జులై 23న వచ్చిన 'జననాయగన్' విజయాన్ని అందుకుంది. విజయ్ నటించిన చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉండడంతో బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇందులో మమిత.. విజ్జి పాత్రలో ఆకట్టుకుంది. సూర్య కథానాయకుడిగా విశ్వనాథ్ అండ్ సన్స్..: భారీ చిత్రం విడుదలైన కొద్దిరోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.240 కోట్ల గ్రాస్‌తో ఘన విజయం సాధించింది. ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాలో మమిత నటన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అల్లరి చేసే పిల్లగా ఆకట్టుకున్న ఆమె.. అమ్మగానూ హృదయానికి హత్తుకునే నటనతో మెప్పించింది. బె÷-లతెహోమ్ కుటుంబ యూనిట్..: నివిన్ పౌలీతో కలిసి మమిత నటించిన ఈ మలయాళ చిత్రం ఆగస్టు 21న విడుదలై సంచలనం విజయం అందుకుంది.


# విభిన్నమైన కథలతో..

'ఇరుముడి' జోష్ మీదున్న రవితేజ.. ఆలస్యం చేయకుండా వెంటవెంటనే రెండు సినిమాలను లైన్లో పెట్టిన విషయం తెలిసిందే. వాటిలో ఒకటి హసిత్ గోలీ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమా కాగా.. రెండోది వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో లక్ష్మణ్ నిర్మిస్తున్న సినిమా. ఈ రెండు సినిమాలూ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కుతున్నట్టు సమాచారం. హసిత్‌గోలీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌తో సాగుతుందట. హీరో శ్రీవిష్ణు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో హీరోయిన్లు కూడా ఖరారైనట్టు తెలిసింది. రవితేజకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటిస్తుండగా, శ్రీవిష్ణుతో మాళవిక మోహనన్ జతకట్టనున్నదని వినికిడి. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. కేవలం నాలుగు నెలల్లోనే ఈ సినిమా పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక వివేక్ ఆత్రేయ సినిమా విషయానికొస్తే.. ఇది హారర్ కామెడీ జానర్ అని తెలిసింది. కథ నచ్చడంతో రవితేజ వెంటనే ఓకే చెప్పారట. ఇదే నిజమైతే రవితేజ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా ఇదే అవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉన్నది.



# దసరా బరిలో 'రణబాలి'.. విడుదల తేదీపై క్లారిటీ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ అభిమానులకు చిత్రబృందం తీపి కబురు అందించింది. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'రణబాలి' విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. గత కొన్ని రోజులుగా వస్తున్న వాయిదా పుకార్లకు స్వస్తి పలుకుతూ, ముందుగా వెల్లడించినట్లే అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు స్పష్టం చేసింది. విజయదశమి పండుగను పురస్కరించుకుని ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. 'టాక్సీవాలా' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. 19వ శతాబ్దపు బ్రిటిష్ పాలన నేపథ్యంలో, 1854-1878 మధ్య జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్‌కు జోడీగా రష్మిక మందన్న నటిస్తోంది. తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్‌లో విజయ్ దేవరకొండ వీరతిలకం దిద్దుకుని ఆవేశంతో కనిపిస్తున్న లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.



# నవంబర్ 27న మైసా విడుదల

### రిలీజ్ డేట్ ప్రకటించిన మేకర్స్

కథానాయిక రష్మిక ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేసింది. ఈ చిత్రాన్ని నవంబరు 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ రిలీజ్ డేట్ ప్రకటన సందర్భంగా మేకర్స్ పంచుకున్న క్యాప్షన్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. సహజంగానే ఆమె దృఢమైనది.. ఎంచుకున్న మార్గంలో భయం లేనిది.. చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. మునుపెన్నడూ చూడని విధంగా 'మైసా' ప్రపంచంలో రష్మికను చూసేందుకు సిద్ధంగా ఉండండి అంటూ చిత్ర బృందం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. మునుపెన్నడూ లేని విధంగా రష్మిక ఈ సినిమాలో పూర్తిస్థాయి యాక్షన్ పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి. రష్మిక కథానాయిక. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న చిత్రమిది. దసరా కానుకగా అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ఇటీవలే చిత్ర బృందం స్పష్టం చేసింది.





Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.